E-KABURU
# ఈ-కబురు
27-02-2025 గురువారం హైదరాబాద్ ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
www.ekaburu.com



విశ్వక్ జోడీగా.. డ్రాగన్ హీరోయిన్
6లో

# ముగిసిన మహాకుంభమేళా

45 రోజుల పాటు సాగిన ఆధ్యాత్మిక వేడుక

ప్రయాగ్ రాజ్ కేంద్రంగా సాగిన మేళా

లక్షలాది సాధుసంతుల రాకతో పావనం

63 కోట్లకు పైగా భక్తుల పుణ్యస్నానాలు

ఉత్సాహంగా తరలివచ్చిన యువత

మళ్లీ 144 సంవత్సరాలకే ఈ భాగ్యం

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో గత 45 రోజులుగా జరుగుతున్న మహాకుంభమేళా బుదవారంతో ప్రశాంతంగా ముగిసింది. జనవరి 13న పుష్య పౌర్ణమి ఘడియల్లో ప్రారంభమైన ఈ అరుదైన ఆధ్యాత్మిక వేడుక.. మాఘ అమావాస్య నాటి మహాశివరాత్రితో ముగిసింది. ఈ నెలన్నర కాలంలో ప్రపంచం నలుమూలల నుంచి 63 కోట్లకు పైగా భక్తులు ప్రయాగ్ రాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు పావన త్రివేణీ సంగమంలో స్నానమాచరించి కొత్త ఆధ్యాత్మిక అనుభూతిని సొంతం చేసుకున్నారు.

**144 ఏళ్లకోసారి వేడుక..**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్, మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని, మహారాష్ట్రలోని నాసిక్‌లో 12 సంవత్సారలకు ఒకసారి కుంభమేళా జరుగుతుంది. అయితే, 144 సంవత్సరాలకోసారి జరిగే మహా కుంభమేళా మాత్రం కేవలం ప్రయాగ్‌రాజ్‌లోనే నిర్వహిస్తారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన సమయంలో మహా కుంభమేళా మొదలవుతుంది. ఈ 45 రోజులలో వచ్చిన పుష్య పౌర్ణమి, మకర సంక్రాంతి, మౌని అమావాస్య, వసంత పంచమి, మాఘ పూర్ణిమ, మహా శివరాత్రి పర్వదినాల్లో కోట్లాదిమంది ఇక్కడ పుణ్యస్నానాలు చేశారు.

**ఘనంగా ముగింపు వేడుక..**

బుధవారం మహాశివరాత్రి రోజు ఏడు శైవ అఖాడాలకు చెందిన మిగతా 2లో





# ఎమ్మెల్సీ యోగం ఎవరికో?

5.. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ

ఒక సీటు జనసేనకు ఇప్పటికే రిజర్వ్

తమకూ ఛాన్స్ ఇవ్వాలంటున్న బీజేపీ

ఆశావహుల జాబితాలో 30 మంది

పది మందితో టీడీపీ షార్ట్ లిస్ట్ రెడీ..

ప్రచారంలో వంగవీటి రాధా, మోపిదేవి పేర్లు

మార్చి 20న పోలింగ్‌కు నిర్ణయం

**అమరావతి, ఈ-కబురు:** ఏపీలో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగటంతో పెద్దసంఖ్యలో ఆశావహులు.. తమ ప్రయత్నాల్లోకి దిగారు. రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్సీల పదవీ కాలం వచ్చే నెల్లో ముగియనుండడంతో ఈ స్థానాలకు ఎన్నిక నిర్వహించేందుకు వీలుగా గత సోమవారం షెడ్యూల్ జారీ అయిన సంగతి తెలిసిందే. కాగా, నామినేషన్ల దాఖలుకు మరో రెండు వారాలే ఉండటంతో నేతలంతా తమ పార్టీ నేతల చుట్టూ ప్రదక్షిణాలు ఆరంభించారు.

**మార్చి 20న పోలింగ్**

ప్రస్తుతం తెలుగుదేశం ఎమ్మెల్సీలుగా కొనసాగుతున్న జంగా కృష్ణమూర్తి, మిగతా 2లో



2లో

## ఈసారి అధికారం మాదే

అవినీతిలో మునిగిన డీఎంకే పార్టీ

భాష, కుటుంబం పేరుతో రాజకీయాలు

ఐదేళ్లలో రాష్ట్రానికి రూ. 5 లక్షల కోట్లిచ్చాం

డీలిమిటేషన్‌తో ఎంపీ సీట్లు తగ్గవు

తమిళం మాట్లాడలేకపోతున్నా.. సారీ

కేంద్ర హోం మంత్రి అమిత్ షా



## ఆ కేసుల్లో ఆరేళ్లు చాలు

కళంకిత నేతలపై సుప్రీంకోర్టులో పిల్

జీవితకాలం ఎన్నికల్లో నిషేధించాలని వినతి

దీనిని వ్యతిరేకిస్తూ కేంద్రం అఫిడవిట్

ఆరేళ్ల నిషేధం చాలంటున్న ప్రభుత్వం

పార్లమెంటే దీనిని నిర్ణయించాలన్న కేంద్రం

2లో

# హర హర మహాదేవ

శివనామస్మరణలో శైవక్షేత్రాలు

భక్తజన సంద్రంగా శ్రీశైల మహాక్షేత్రం

వైభవంగా మల్లన్న శివరాత్రి వేడుకలు

కిక్కిరిసిన పంచరామ క్షేత్రాలు

కిటకిటలాడిన వేములవాడ రాజన్న గుడి పరిసరాలు

తెలుగునేలపై వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



**అమరావతి, శ్రీశైలం, ఈ-కబురు:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు నేల మీది శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఏపీలోని ప్రసిద్ధ పంచారామాల్నా, శ్రీశైలం, శ్రీకాళహస్తి, అమరావతి, కోటప్పకొండ క్షేత్రాల్లోని ఆలయాలకు, తెలంగాణలోని వేములవాడ, కీసర వంటి క్షేత్రాలకు ఉదయం నుంచే బారులు తీరారు. ఆయా ఆలయాల నదీ తీరాల్లో పుణ్యస్నానాలు చేసి శివయ్యను దర్శించుకుని మిగతా 2లో



# పండగ పూట విషాదం

2లో

ఏపీలో 12 మంది, తెలంగాణలో ఒకరి మృతి

పుణ్యస్నానానికి వెళ్లిన తాడిపూడి విద్యార్థులు

గోదావరి నదిలో మునిగి ఐదుగురి గల్లంతు

మృతులంతా ఒకే గ్రామవాసులు

శ్రీశైలం, తమ్మిలేరు వద్ద నలుగురి కన్నుమూత

పండగ వేళ..ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం

# డబ్బు కట్టు.. కార్డు పట్టు

విదేశీ సంపన్నలకు ట్రంప్ ఆఫర్

అమెరికాలో పెట్టుబడి పెడితే గోల్డ్ కార్డ్

కార్డు ధర.. ఐదు మిలియన్ డాలర్లు

దానితోనే గ్రీన్ కార్డ్ వస్తుందని వివరణ

వచ్చే 4 ఏళ్లలో 10 లక్షల కార్డుల జారీ

**నేషనల్ బ్యూరో, ఈ-కబురు:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో ఊహించని ప్రకటన చేశారు. అమెరికాలో పెట్టుబడి పెట్టే విదేశీ సంపన్నులకు త్వరలోనే గోల్ట్ కార్డును మిగతా 2లో





2లో

# కొన'సాగు'తున్న ఆపరేషన్

బుధవారం మర్కోస్ టీమ్ చేరిక

11 విభాగాల సమన్వయంతో ఆపరేషన్

రాజకీయాలొద్దు.. ప్లీజ్: మంత్రి ఉత్తమ్

# వేములవాడలో అభివృద్ధి పనులు కొనసాగించాలి

ప్రభుత్వాలు మారినా పనులు ఆగొద్దు

వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

2లో



# వైభవంగా ముగిసిన మహాకుంభమేళా



మొదటి పేజీ తరువాయి

సాధువులు పేష్వై ఊరేగింపుల తర్వాత కాశీ విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక ప్రార్ధనలు చేశాక.. మహాకుంభమేళా ముగిసినట్లు ప్రకటించారు. ఈ పేష్వై ఊరేగింపులో 10,000 మందికి పైగా నాగ సాధువులు కాశీ రోడ్ల గుండా తమ దేవతలు, జెండాలతో, త్రిశూలాలు, కత్తులు, గదలను ప్రదర్శిస్తూ 'హర్ హర్ మహాదేవ్' నినాదాల మధ్య పాడుతూ, నృత్యం చేస్తూ ప్రదర్శన చేశారు. ఆ సమయంలో యూపీ సర్కారు వారిపై పూలవర్షం కురిపించింది. ఒక్క బుధవారం రోజే 1.35 కోట్లమంది భక్తులు సంగమస్నానం చేశారు.

**రికార్డు లెక్కలు..**

ఈ 45 రోజులలో త్రివేణీ సంగమంలో దాదాపు 70 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయగా, గిన్నిస్ రికార్డ్ లక్ష్యంగా 15 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు క్లీన్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవానికి యూపీ ప్రభుత్వం రూ.2100కోట్ల స్పెషల్ గ్రాంట్ మంజూరు చేయగా, మొత్తంగా ఇక్కడ ఈ 45 రోజుల్లో రూ. 3 లక్షల కోట్ల వ్యాపారం జరిగినట్లు సీఏఐటీ వర్గాలు తెలిపాయి. ఈ వేడుక కోసం 37వేల మంది పోలీసులు, 14 వేల మంది హోంగార్డులు భద్రతా విధులు నిర్వహించగా, 2750 ఏఐ సీసీటీవీలు, 3 జల్ పోలీస్‌స్టేషన్లు, 18 జల్ పోలీస్ కంట్రోల్ రూమ్‌లు, 50 వాచ్‌టవర్లను ఏర్పరచారు. యాంటీడ్రోన్ వ్యవస్థ, ఏఐ ఆధారిత కెమెరాలతో పాటు 40 హెక్టార్ల విస్తీర్ణంలో మహాకుంభ్ నగర్ పేరుతో తాత్కాలికంగా ఓ జిల్లానే ఏర్పాటు చేశారు.

**అయోధ్యకు భక్తజనం**

గడిచిన 52 రోజుల్లో సుమారు 17 కోట్ల మంది భక్తులు అయోధ్య రామాలయాన్ని దర్శించుకున్నారని సీఎం యోగి ఆదిత్యానాథ్ వెల్లడించారు. మక్కాకు ఏడాదికి 1.4 కోట్ల మంది, వాటికన్‌సిటీకి 80 లక్షల మంది సందర్శిస్తున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. భక్తులు తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లేందుకు రైల్వే శాఖ.. మహాశివరాత్రి సందర్భంగా ప్రయాగ్‌రాజ్ నుండి 350కి పైగా స్పెషల్ రైళ్లను నడిపింది.

# ఈసారి అధికారం మాదే



నేషనల్ బ్యూరో, ఈ-కబురు: తమిళనాడులో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో దేశ వ్యతిరేక పార్టీ అయిన డీఎంకే ఓడిపోవటం ఖాయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు- కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న వేళ.. బుధవారం ఆయన కోయంబత్తూరు, తిరువన్నామలై, రామనాథపురం జిల్లా కేంద్రాల్లో బీజేపీ కార్యాలయాలను ప్రారంభించిన అనంతరం పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన సభలో అమిత్ షా మాట్లాడారు. అత్యంత ప్రాచీన భాష అయిన తమిళానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని చెప్పుకొచ్చారు.

**అవినీతిపై కామెంట్స్**

అవినీతి కేసుల్లో డీఎంకే నేతలు మాస్టర్ డిగ్రీలు చదివారని అమిత్ షా మండిపడ్డారు. వాళ్ల నాయకుల్లో ఒకరు క్యాష్ ఫర్ జాబ్స్ కేసులో, మరొకరు మనీ లాండరింగ్, అక్రమ ఇసుక తవ్వకం కేసులో, ఇంకొకరు ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఉన్నారని అమిత్ షా గుర్తుచేశారు. తమిళనాడుకు నిధులు ఇవ్వడం లేదని సీఎం స్టాలిన్ చేసిన ఆరోపణలను కూడా షా ఖండించారు. గత ఐదేళ్లలో తమిళనాడుకు కేంద్రం ఐదు లక్షల కోట్లు ఇచ్చిందని చెప్పారు.

**సారీ.. తమిళం రాదు**

ఈ కార్యక్రమంలో అమిత్ షా మాట్లాడుతూ, అత్యంత ప్రాచీన మైన భాష అయిన తమిళంలో తాను మాట్లాడలేకపోతున్నందుకు సభికులకు క్షమాపణలు తెలిపారు. భాష, సంస్కృతిని తమ రాజకీయ ప్రయోజనాలను వాడుకుంటూ తమిళనాడును దోచేస్తున్న డీఎంకే కుటుంబ రాజకీయాలను, అవినీతిని అంతం చేస్తూ.. 2026లో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని, త్వరలోనే ఇక్కడ కూడా ఏపీలో మాదిరిగా ఎన్డీయే సర్కారు అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**మీకు ఏ నష్టమూ లేదు..**

డీలిమిటేషన్ ప్రక్రియతో తమిళనాడు 8 ఎంపీ సీట్లను కోల్పేయే ప్రమాదముందన్న సీఎం స్టాలిన్ వ్యాఖ్యలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఖండించారు. ఈ ప్రక్రియ మూలంగా తమిళనాడు ఒక్క పార్లమెంటరీ స్థానాన్ని కూడా కోల్పోదని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత కూడా దక్షిణాదిలోని ఏ రాష్ట్రానికీ సీట్లు తగ్గవని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పటికే లోక్‌సభలో ప్రకటన చేశారని అమిత్ షా గుర్తు చేశారు.

**2024 ఎంతో ప్రత్యేకం..**

2024వ సంవత్సరం బీజేపీకి ఎంతో ప్రత్యేకమని, ఈ ఏడాదిలోనే మోదీ మూడవసారి ప్రధాని కావటంతో బాటు ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. అలాగే, మహారాష్ట్ర, హరియాణా, ఢిల్లీ రాష్ట్రాల ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని అమిత్ షా గుర్తుచేశారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రం వల్ల విద్యార్థులు తమ మూలాలకు దగ్గరవుతారని, ఈ విధానం విషయంలో కేంద్రం ఎవరినీ బలవంతం చేయటం లేదని, ఇలాంటి విషయాన్ని డీఎంకే రాజకీయం చేస్తోందని మండిపడ్డారు.



## వేములవాడలో అభివృద్ధి పనులు కొనసాగించాలి

వేములవాడ, ఈ-కబురు: అభివృద్ధి పనుల విషయాల్లో రాజకీయాలు చేయొద్దని, ప్రభుత్వాలు మారినా అభివృద్ధి పనులు ఆపొద్దని ఎమ్మెల్సీ కవిత సూచించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడలో బీఆర్ఎస్ పార్టీ హయాంలో మొదలైన అభివృద్ధి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారిన అభివృద్ధి కొనసాగాలని అన్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణకు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. వేములవాడ అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం కేసీఆర్ రూ.250 కోట్లు ఖర్చు చేశారని చెప్పారు. అయితే, ప్రభుత్వాలు మారినంత మాత్రాన అభివృద్ధి ఆగవద్దని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడ అభివృద్ధిని కొనసాగించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో గుడి చెరువు వద్ద 30 ఎకరాలను ప్రభుత్వం కొనుగోలు చేసి ఆలయానికి అందించిందని, ప్రస్తుతం అక్కడ అభివృద్ధి జరగడం లేదని స్థానికులు చెబుతున్నారని, కాబట్టి అక్కడ అభివృద్ధి పనులను కొనసాగించి త్వరగా పూర్తిచేయాలన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా అంటేనే చేనేత జిల్లాగా పేరు పొందిందని, చేనేత కార్మికుల కోసం నాడు మంత్రిగా కేటీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు.

# ఎమ్మెల్సీ యోగం ఎవరికో?



మొదటి పేజీ తరువాయి

దువ్వారపు రామారావు, పరుచూరి అశోక్ బాబు, బీటీ నాయుడు, యనమల రామకృష్ణుడుల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది. ఈ లోగా కొత్తవారిని నియమించేందుకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. మార్చి 20వ తేదీన దీనికోసం పోలింగ్ జరగనుంది. ఈ 5 సీట్లు కూటమికే ఏకగ్రీవంగా దక్కనున్నందున.. ఇప్పటి నుంచే ఆశావహులంతా తమ ప్రయత్నాల్లోకి దిగారు.

**తొలి సీటు నాగబాబుకే..**

ఈ జాబితాలో జనసేన నుంచి పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకు ఒక సీటు ఇప్పటికే కన్ఫామ్ అయింది. ఆయనకు మంత్రిగానూ అవకాశం కల్పించాలని సీఎం, డిప్యూటీ సీఎం ఇప్పటికే నిర్ణయించారు. ఇక.. ఆ మిగిలిన 4 సీట్లలో ఒక సీటును బీజేపీ కోరుతున్నట్లుగా తెలుస్తోంది. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్సీ మాధవ్ పోటీలో ఉన్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే.. ఇది మిగిలేది మూడు సీట్లు మాత్రమే.

**ఆశావహుల జాబితా..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని అర్హతలున్నా.. జనసేన, బీజేపీ అభ్యర్థుల కోసం సీటును వదులుకుని, గత 9 నెలలుగా ఎలాంటి నామినేటెడ్ పోస్టు లేదా పార్టీలో పెద్ద బాధ్యత దక్కని నేతల పేర్లను టీడపీ అధిష్ఠానం పరిశీలిస్తోంది. దీనికి తోడు, సామాజిక, ప్రాంతాల వారీ సమీకరణాలనూ జోడించి చూశాక.. పది మంది నేతలు కీలక పోటీదారులుగా కనిపిస్తున్నారు. వారిలో టీడీపీ నేత వంగవీటి రాధాకృష్ణ, పిఠాపురం టీడీపీ నేత వర్మ, మాజీమంత్రులు జవహర్, దేవినేని ఉమామహేశ్వ రావు తొలి నాలుగు స్థానాల్లో ఉండగా, రెడ్డి సుబ్రహ్మణ్యం, గన్ని వీరాంజనేయులు, తిప్పేస్వామి, నల్లపాటి రాము, ప్రభాకర్ చౌదరి, కొమ్మాలపాటి శ్రీధర్ తదితరులు ఉన్నారు. గత ఐదేళ్లలో పార్టీ విపక్షంలో ఉండగా ఎమ్మెల్సీలుగా ఉంటూ అమరావతి ఉద్యమంలో పాల్గొన్న నేతలూ తమకు అవకాశం ఇవ్వాలంటూ నారా లోకేశ్‌ను కలిసే ప్రయత్నాలు ఆరంభించారు. ప్రభుత్వంపై శాసనమండలిలో గట్టి పోరాటం చేసిన మంతెన సత్యనారాయణ రాజు, బీదా రవిచంద్ర యాదవ్, బుద్ధా వెంకన్న, అంగర రామ్మోహన్ తదితరులు ఈసారి తమ పేరును పరిశీలించాలని కోరారు. డొక్కా మాణిక్య వరప్రసాద్, పోతుల సునీత లాంటి వారు క్లిష్టసమయంలో పార్టీని వదిలినా ఎలాంటి ఒత్తిళ్లకూ లొంగకుండా పార్టీ కోసం తాము నిలిచామని వీరు చెప్పుకొస్తున్నారు. ఇటీవల వైసీపీని వీడి టీడీపీ కండువా కప్పుకున్న మోపిదేవి వెంకటరమణకు ఎమ్మెల్సీగా అవకాశం రావడం ఖాయమన్న ప్రచారం టీడీపీ వర్గాల్లో సాగుతోంది. అలాగే, కాపు సామాజిక వర్గంలో కీలక నేత, దివంగత రంగా కుమారుడైన రాధా... గత ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉండి, కూటమి విజయం కోసం పని చేసినందున ఆయనకు ఇప్పటికే టీడీపీ అధిష్ఠానం ఓ సీటు రిజర్వ్ చేసిందనే టాక్ కూడా వినిపిస్తోంది.

## కొన'సాగు'తున్న ఆపరేషన్

హైదరాబాద్, ఈ-కబురు: ప్రతిపక్షాలు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదాన్ని కూడా రాజకీయం చేస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి దేశంలోనే టన్నెల్ అంశంలో అత్యున్నత నైపుణ్యం గల నిపుణులు ఉన్న ఆర్మీతో చర్చించామని చెప్పారు. బుధవారం టన్నెల్‌ను పరిశీలించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు.

**కొనసాగుతున్న ఆపరేషన్..**

ఫిబ్రవరి 22 ఉదయం కూలిపోయిన టన్నెల్‌లో ఎనిమిది మంది చిక్కుకున్నారని, ఈ ఘటన జరిగిన మూడు గంటల్లోనే తాను ఇక్కడికి వచ్చానని ఆరోజు నుంచి ఇప్పటి వరకు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నానని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశ సరిహద్దులో టన్నెల్ నిర్మించిన %ుదీవీ% నిపుణులను టన్నెల్ లోపలకు పంపి రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం చేశామని అన్నారు. 200 మీటర్ల వరకు మట్టి, నీరు కలిసి పేరుకుపోవటంతో ఆపరేషన్ ఆలస్యమవుతోందని మంత్రి తెలిపారు.

## ఆ కేసుల్లో ఆరేళ్లు చాలు

నేషనల్ బ్యూరో, ఈ-కబురు: దేశవ్యాప్తంగా పలు కేసుల్లో దోషులుగా తేలిన రాజకీయ నాయకులను.. జీవిత కాలం పాటు ఎన్నికల్లో పోటీచేయకుండా నిషేధించాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో దాఖలైన పిటిషన్ మీద కేంద్రం బుధవారం తన వైఖరిని తెలియజేసింది. అయితే, ఇలాంటి కేసుల్లో ఓ వ్యక్తిపై జీవిత కాల నిషేధం అనేది అత్యంత కఠిన నిర్ణయమే అవుతుందని, ఇలాంటి కేసుల్లో దోషులకు ఆరేళ్ల శిక్ష వేస్తే సరిపోతుందని కోర్టు ముందు కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌లో తెలియజేసింది. పలు కేసులలో దోషులుగా తేలిన నేతలపై జీవిత కాలం నిషేధం విధించాలంటూ న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ 2016లో సుప్రీంకోర్టులో గతంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్ లతో కూడిన ధర్మాసనం ఈ నెల 10వ తేదీన విచారణ జరిపింది. కాగా.. దీనిపైనే అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సమర్పించిన నివేదికను కూడా ధర్మసానం పరిశీలించింది. ఈ నేపథ్యంలో దీనిపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రంతో బాటు కేంద్ర ఎన్నికల సంఘానికీ సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం తాజాగా తన అభిప్రాయాన్ని వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేసింది.

## పండగ పూట విషాదం

అమరావతి, హైదరాబాద్, ఈ-కబురు: మహా శివరాత్రి వేళ తెలుగు రాష్ట్రాలలోని వేర్వేరు ప్రాంతాలలో పుణ్య స్నానాలకు వెళ్లిన సమయంలో గల్లంతై ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. తూర్పుగోదావరి జిల్లా తాడిపూడి, శ్రీశైలం, తమ్మిలేరు, నెల్లూరు, మంచిర్యాల జిల్లాల్లో జరిగిన ఈ ఘటనలు ఆయా కుటుంబాలలో విషాదాన్ని నింపాయి. మహాశివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున 11 మంది యువకులు గోదావరిలో స్నానం చేసేందుకు వెళ్లారు. నదిలో లోతుగా ఉన్న ప్రదేశాన్ని గుర్తించకపోవడంతో వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగిపోయారు. ఈ క్రమంలో ఒకరినొకరు రక్షించుకునే ప్రయత్నంలో ఆ ఐదుగురూ గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు.. గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నానికి గల్లంతైన తిరుమలశెట్టి పవన్ (17), పడాల దుర్గాప్రసాద్ (19), పడాల సాయి కృష్ణ (19), అనిశెట్టి పవన్(19), గర్రె ఆకాశ్(19) మృతదేహాలు లభ్యమయ్యాయి. వీరంతా కొవ్వూరు, తాళ్లపూడి, రాజమండ్రిలో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు. పైగా, వారంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో పండగపూట.. అక్కడ తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి.

## మొదటి పేజీ తరువాయి

### హర హర మహాదేవ

అభిషేకాది సేవలలో పాలుపంచుకున్నారు.

**శ్రీగిరికి భక్త ప్రవాహం**

ఇక.. ప్రముఖ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు. సుమారు 1.5 లక్షల మంది బుధవారం సాయంత్రానికే పాతాళగంగలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి.. క్యూ లైన్లలో నిలుచుని ఆది దంపతులను దర్శించుకున్నారు. నల్లమల గిరులు శివనామ స్మరణతో దద్దరిల్లాయి. బుధవారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు పాగాలంకరణ, అర్థరాత్రి లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక అభిషేకం, కల్యాణాలను అధికారులు అత్యంత వైభవంగా నిర్వహించారు.

**శ్రీకాళహస్తిలో**

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోనూ మహాశివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఇక్కడి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని, ఏపీ సర్కారు తరపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, శ్రీకాళహస్తి శాసన సభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి కలిసి శ్రీకాళహస్తీశ్వర స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

### డబ్బు కట్టు.. కార్డు పట్టు

అందిస్తామన్నారు. ఇప్పుడున్న.. EB-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ వీసా ప్రోగ్రామ్ స్థానంలో గోల్ట్ కార్డులను అవ్వనుందని, దీని ద్వారా అమెరికా పౌరసత్వం సులువు కావటమే గాక వ్యాపార పరంగానూ ఆయా వ్యక్తులు లాభపడొచ్చని ట్రంప్ చెప్పుకొచ్చారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలను తొందరలోనే చెబుతామని తెలిపారు.

**EB-5వీసా అంటే..**

అమెరికాలో వ్యాపారం చేయాలన్నా, పెట్టుబడి పెట్టాలన్నా లేదా తొందరగా గ్రీన్ కార్డ్ రావాలంటే ఈ వీసా ఉండాలి. దీనిని 1990లో అమెరికా కాంగ్రెస్ ఆమోదించింది. 2021 సెప్టెంబరు నుంచి 2022 సెప్టెంబరు 30 మధ్యకాలంలో 8వేల మంది పెట్టుబడిదారులు ఈ వీసాలు పొందారు.అయితే, దీని వలన ఆయా దేశాల ఆర్థిక నేరగాళ్లు అమెరికాలో చేరుతున్నారనే ఉద్దేశంతో.. ట్రంప్ ఈ వీసాను తీసేసి దీని స్థానంలో తగిన స్క్రూటినీ విధానం తర్వాత గోల్డ్ కార్డ్ ఇవ్వాలనేది ట్రంప్ యోచన. ఇదేమీ కొత్త కాన్సెప్ట్ కాదని, ప్రపంచవ్యాప్తంగా 100 దేశాలు పలు పేర్లతో పెట్టుబడిదారులకు వీసాలు ఇస్తున్నాయని ట్రంప్ చెప్పుకొచ్చారు. తామిచ్చే.. గోల్డ్ కార్డ్‌కు ఎలాంటి పరిమితులు ఉండవని తెలిపారు. అమెరికాలో ఉద్యోగాలు సృష్టించే వారికి.. లేదంటే పెట్టుబడులు పెట్టేవారికి గోల్డ్ కార్డులు మంజూరు చేస్తామని ట్రంప్ చెప్పారు. ఈ కార్డు ధరను 5 మిలియన్లు(రూ. 44 కోట్లు)గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా సంపన్నులు అమెరికాలోకి ప్రవేశించొచ్చని, ఈ కార్డు ద్వారానే గ్రీన్ కార్డ్ రెసిడెన్సీ స్టేటస్, ఆపైన సులభంగా అమెరికా పౌరసత్వం పొందే అవకాశం కూడా ఉందని తెలిపారు.

## కుంభమేళా నుంచి వస్తుండగా ప్రమాదం

### రాజ్యసభ ఎంపి మహువా మాజీకి గాయాలు

**రాంచీ:** కుంభమేళా నుంచి తిరిగొస్తుండగా బుధవారం తెల్లవారుజామున ఝార్ఖండ్ రాజ్యసభ ఎంపీ మహువా మాజీ వాహనానికి ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలవగా రాంచీలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ ముక్తి మోర్చా కు చెందిన ఎంపీ మహువా తన కుమారుడు, కోడలితో కుంభమేళాకు వెళ్లి బుధవారం తెల్లవారుజామున తిరిగివస్తుండగా.. ఝార్ఖండ్‌లోని లతేహార్ ప్రాంతంలో ఆగి ఉన్న ఓ ట్రక్కును వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎంపీకి, ఆమె కుటుంబసభ్యులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రాంచీలోని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఎంపీ చేతికి పలు ఫ్రాక్చర్‌లు అయ్యాయని, ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు.

## శంభాజీ చరిత్ర సినిమాగా రావడం హర్షణీయం

### విజయవాడలో చిత్రాన్ని వీక్షించిన మంత్రి సత్యాకుమార్

**విజయవాడ:** హిందూ సామ్రాజ్య స్థాపనకు కృషి చేసిన శంభాజీ మహారాజ్ సినిమాను విజయవాడలో మంత్రి సత్యకుమార్ యాదవ్ వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడున్నరేళ్ళ తరువాత సినిమా చూశానని.. ఒక వీరుడి సినిమా చూశాననే ఆనందం ఉందన్నారు. ఒక వీరుడి ముగింపు అలా జరిగినందుకు వేదన ఉంది.. ఛత్రపతి శివాజీ, శంభాజీ మహారాజ్‌లను మొదటి స్వాతంత్ర్య యోధులుగా చెప్పాలని పేర్కొన్నారు. అలాంటి వారి చరిత్ర సినిమాగా తీసినందుకు దర్శక నిర్మాతలను అభినందిస్తున్నానని తెలిపారు. సమకాలీన చరిత్రకారుల పైన సినిమా తీయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభిప్రాయపడ్డారు. వ్యాపారం కోసం స్మగ్లర్లను హీరోలుగా చూపించే విధానం సరికాదని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. హీరోలు గంజా డ్రగ్స్ తీసుకునే సినిమాలు, వ్యాపారం కోసం హీరోలను స్మగ్లర్లుగా చూపించే సినిమాలు యువతను తప్పు దారిలోకి నడిపిస్తాయని మంత్రి అన్నారు. వీరసావర్కర్ వర్ధంతి సందర్భంగా మరొక వీరుని సినిమా చూశానని.. సూరత్ నుంచి తంజావూరు వరకూ శంభాజీ హిందూ సామ్రాజ్యం నెలకొల్పాడని పేర్కొన్నారు. మన దేశానికి వలస పాలకులను గొప్ప హీరోలుగా చరిత్రకారులు సృష్టించారన్నారు. దేశంలో 60 ఏళ్ళకు పైగా పరిపాలన చేసిన పార్టీ మొఘలులు, తలిదండ్రులను చంపిన వారిని చరిత్తకారులుగా చూపించిందన్నారు. శంభాజీ, శివాజీ లాంటి వారి చరిత్ర అందరూ చదువుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

## పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఘోరం

**పుణె:** పూణేలో దారుణం చోటు చేసుకుంది. రద్దీగా ఉండే స్వర్గేట్ బస్టాండ్‌లో, పోలీస్ స్టేషన్‌కి కూతవేటు దూరంలో మహిళపై అత్యాచారం జరగడం సంచలనంగా మారింది. నిందితుడిని దత్తాత్రేయ రాందాస్‌గా గుర్తించారు. పోలీస్ స్టేషన్‌కి 100 మీటర్ల దూరంలో, నిలిచి ఉన్న బస్సులో మంగళవారం 26 ఏళ్ల మహిళపై అత్యాచారం జరిగింది. సీసీటీవీ కెమెరాల్లో నిందితుడిని గుర్తించారు. నిందితుడిని పట్టుకునేందుకు 8 పోలీస్ టీంలను ఏర్పాటు చేశారు. స్నిఫర్ డాగ్స్‌ని రంగంలోకి దించారు. నిందితుడు 36 ఏళ్ల రాందాస్‌కి గతంలో నేరచరిత్ర ఉన్నట్లు గుర్తించారు.సతారా జిల్లాలోని ఫల్తాన్ అనే గ్రామానికి చెందిన మహిళ, పనిమనిషిగా పనిచేస్తుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నేరం ఉదయం 5.45 నుంచి 6.30 గంటల మధ్య జరిగినట్లు చెబుతున్నారు. సీసీటీవీ ఫుటేజీలో మహిళతో ముందుగా నిందితుడు మాట్లాడుతున్నట్లు కనిపించింది. ఆమె గమ్యస్థానాన్ని తెలుసుకున్న నిందితుడు, ఆగి ఉన్న బస్సు వెళ్తుందని అందులోకి వెళ్లాలని సూచించినట్లు బాధితురాలు తెలిపింది. లైట్లు లేకపోవడంతో సందేహించానని, అయితే ప్రయాణికులు నిద్ర పోతుండటంతో లైట్లు ఆర్పేశానని నిందితుడు చెప్పాడని ఆమె తెలిపింది. బస్సులోకి వెళ్లగానే, నిందితుడు డోర్లు మూసేసి తనపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలిపింది. జరిగిన విషయాన్ని, తన స్నేహితురాలికి తెలపడంతో పోలీసుల ఫిర్యాదు చేశారు. ఈ బస్ స్టాండ్ మహారాష్ట్ర ఆర్టీసీ నడిపే అతిపెద్ద బస్ స్టాండ్లలో ఒకటి. మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ హర్షవర్ధన్ సప్కల్ మాట్లాడుతూ..రాష్ట్రంలో అత్యాచారాలు పెరిగాయని, తాజాగా ఘటన 2012 ఢిల్లీ నిర్భయ ఘటనను గుర్తుకు తెస్తోందని విమర్శించారు. నేరాలకు అడ్డుకట్ట వేయడంలో ప్రభుత్వం విఫమైందని ఎన్సీపీ నేత సుప్రియా సూలే ఆరోపించారు.

## యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**నంద్యాల:** మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రమైన యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి అమ్మ వార్లకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. ఇందిరమ్మ దంపతులు దర్శించుకున్నారు.. యాగంటి ఆలయ క్షేత్రానికి చేరుకున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులకు ఆలయం మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు, ఆలయ సంప్రదాయబద్ధంగా తలపాగా ధరించిన మంత్రి స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను భక్తిశ్రద్ధలతో తలపై ఉంచుకొని ఉమా మహేశ్వర స్వామి వారి సన్నిధికి చేరుకున్నారు.. ఏకశిలపై కొలువున్న ఉమామహేశ్వరులకు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దంపతులు విశేష అభిషేక ప్రత్యేక పూజలను నిర్వహించారు, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఉదయం 5 గంటల నుండి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి, వంటి విశేష పూజలను, వేద పండితుల మంత్రోచ్ఛారణాలతో ఆలయ అర్చకులు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు, , యాగంటిలో స్వామి అమ్మ వారిని దర్శించు కునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భారీ ఎత్తున తరలి వచ్చిన భక్తులు క్యూలైన్ల లో నిలిచి ఉన్నారు, స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు రెండు గంటల సమయం పడుతున్నట్లు భక్తులు వెల్లడించారు. మరోవైపు.. ఉమామహేశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి.. స్వామి అమ్మ వారి సన్నిధిలో తాను రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదన్నారు.

# మోడీ ద్వయం ఏమి చేయబోతున్నది ..

ప్రధాని మోడీ, అమిత్‌షాలు నిశ్శబ్దంగా ఉన్నారంటే ఎవరికో మూడినట్లే. వారు ఏదైనా అలజడి సృష్టించే ముందు ప్రశాంతంగా ఉంటారు. ఎవ్వరికీ అంతుచక్కకుండా ఉంటారు. వారి వ్యూహాలను పసిగట్టడం వారితో ఉన్నా వారికి కూడా తెలియదు. కాంగ్రెస్ ముక్తభారత్ నినాదంతో రాజకీయాలు నెరిపిన మోడీ కొంతవరకు విజయం సాధించారు. గత ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌కు పార్లమెంటులో ప్రతిపక్ష హోదా లేకుండా చేశారు. అయితే ఇదొక్కటే చేయడం వల్ల ప్రజలు హర్షించరు..గుర్తించరని వారు గమనించలేక పోయారు. అందుకే గత ఎన్నికల్లో కాంగ్రెస్ వందసీట్లు గెల్చుకుని ప్రధాన ప్రతిపక్షంగా పార్లమెంటులో అడుగుపెట్టింది. ఆ పార్టీ కూడా వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. వయనాడ్‌తో పాటు రాయబరేలీలో కూడ రాహుల్ గెలిచి, వయనాడ్‌లో చెల్లెలు ప్రియాంకను మెల్లంగా లోక్‌సభ గడప తొక్కేలా చేశారు. అంతకుముందే తల్లి సోనియా రాజ్యసభలో చేరారు. మొత్తంగా కుటుంబం అంతా పార్లమెంటులో ఉన్నారు. ఇక మిగిలింది రాబర్ట్ వాద్రా మాత్రమే. ఆయన కూడా కర్నాటక లేదా తెలంగాన నుంచి రాజ్యసభ మెట్లు తొక్కినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. అయితే ఇదంతా కాంగ్రెస్ వైపు కనిపిస్తున్న కోణం. మోడీ కోణం మరోటిగా ఉంది. కేవలం 240 సీట్లకే పరిమితమైన బిజెపి, మొన్నటి ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజార్టీ సాధించలేకపోయింది. ఈ క్రమంలో మళ్లీ కమలం ఆపరేషన్ మొదలవుతుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. తమ కాంగ్రెస్ ముక్త భారత్ వ్యూహంలో భాగంగా మెల్లగా అడుగులు వేసే సూచనలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ మరో ఐదేళ్ల వరకు అధికారం కోసం వేచిచూడక తప్పదు. ఈలోగా పార్టీలో ఉన్న వృద్ధనేతలకు అంతకాలం వేచిచూసే ఓపిక ఉండదు. రాజకీయాల్లో ఇప్పుడు తమ వయసురీత్యా కూడా రాజకీయాలు నెరపుతున్నారు. తాజాగా శశిథరూర్ మోడీకి దగ్గరవుతున్నారన్న సంకేతాలు...తుఫాన్‌కు ముందు ప్రశాంతత లాంటివనే చెప్పాలి. అయితే తాను పార్టీ వీడడం లేదని శశిథరూర్ స్పష్టం




చేసారు. ప్రతి రాజకీయవేత్త పార్టీ మారు క్రమంలో చేసే సాధారణ ప్రకటన ఇది. అయితే ఒక్క శశిథరూర్ కోసం మోడీ ద్వయం ప్రయత్నించదని గుర్తించాలి. ఆయనతోపాటు మరికొందరి కోసం గాలం వేసివుంటారు. కాంగ్రెస్‌ను చీల్చి చెండాడడానికి సమయం కోసం ఎదురు చూస్తున్నారు. రాహుల్ నాయకత్వం పట్ల విశ్వాసం లేని వారు వీరివలలో పడడం ఖాయం. కేరళలో సొంతంగా ప్రజలలోఇమేజ్‌ను ఆసరా చేసుకొని వరుసగా నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన మాజీ కేంద్ర మంత్రి శశిథరూర్ ఇప్పుడు పార్టీలో తిరుగులేని నేతగా వెలుగొందుతున్న రాహుల్ గాంధీపై తిరుగుబాటు ధోరణి ప్రదర్శిస్తున్నారు. వరుసగా హర్యానా,మహారాష్ట్ర, ఢిల్లీలలో ఘోర పరాజయాలు మూటగట్టుకున్న తర్వాత 'ఇండియా' కూటమిలోని భాగస్వామ్య పార్టీలు అన్ని దూరం అవుతున్న సమయంలో శశిథరూర్ వ్యవహరిస్తున్న తీరు ఆ పార్టీ శ్రేణులను కలవరం పరుస్తున్న మాట నిజం. 2019లో పార్టీ పరాజయం తర్వాత, 2020లో ఐదుగురు మాజీ ముఖ్యమంత్రులు, పలువురు ఎంపిలు, మాజీ కేంద్ర మంత్రులతో కలిసి 23 మంది పార్టీ అధినేత్రికి రాసిన లేఖలో సైతం తిరుగుబాటు ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలో గులాం నబీ ఆజాద్, కపిల్ సిబల్ లాంటి వారు తమదారి తాము చూసుకున్నారు. ఎందుకంటే కాంగ్రెస్ ఇకముందు సంపూర్ణ మెజార్టీతో తిరిగి అధికారంలోకి వస్తుందని నేతలకు నమ్మకం పోయింది. అందుకే శశిథరూర్ తిరుగుబాటును ఆ విధంగా కొట్టిపారివేయ లేము. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి అక్టోబర్, 2022లో జరిగిన ఎన్నికల్లో గాంధీ కుటుంబం బలపరిచిన మల్లికార్జున్ ఖర్గేపై పోటీ చేసి మొత్తం 5000 మంది ఓటర్లలో 1500కు పైగా ఓట్లు సంపాదించడం పార్టీలో విస్తృత ప్రతిపాదికలో థరూర్‌కు గల మద్దతును తెలుపుతున్నది. నిజంగా ఆ నాడు థరూర్‌ను పార్టీ అధ్యక్షునిగా ఎన్నుకొని ఉంటే నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ బలమైన ప్రాతిపదికను ఏర్పరచుకొని ఉండేదని పలువురు భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షునిగా రెండోసారి ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ను కలిసేందుకు ప్రధాని మోడీ ప్రత్యేకంగా అమెరికాకు వెళ్లిన సందర్భంలో రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు తీవ్రమైన విమర్శలు గుప్పిస్తే, శశిథరూర్ మాత్రం ఫలవంతమైన పర్యటన అని పొగడ్తలతో ముంచెత్తారు. అక్రమ వలసదారులు అమానుష రీతిలో పంపడాన్ని మోడీ ప్రస్తావిస్తే బాగుండెడిది అని చురకలు అంటిస్తూనే టారిఫ్‌ల విషయంలో వెంటనే ట్రంప్ కఠిన నిర్ణయం తీసుకోకుండా చర్చల పేరుతో వాయిదా వేయగలిగారని కొనియాడారు. తమ రాజకీయ ప్రత్యర్థులను థరూర్ పొగడ్తలతో ముంచెత్తడం సహజంగానే కాంగ్రెస్ నేతలకు ఆగ్రహం కలిగించింది. విదేశీ పర్యటనలో ఉన్న థరూర్ తో వెంటనే మాట్లాడాలని స్వయంగా రాహుల్ గాంధీ రంగంలోకి దిగారు. ఫిబ్రవరి 18న రాహుల్‌ను కలిసిన థరూర్ తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో తన పాత్ర ఏమిటో ముందు స్పష్టం చేయమని రాహుల్ గాంధీని నిలదీశారు. పార్లమెంట్ చర్చలలో పార్టీ ప్రతినిధిగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని, పార్టీలో సైతం తనకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదని, ఏ కమిటీలో తనకు అవకాశం ఇవ్వడం లేదని నిలదీశారు. ఈ విషయాలపై ఎటువంటి సమాధానం ఇవ్వలేక రాహుల్ గాంధీ మౌనం వహించినట్లు తెలుస్తున్నది. అంతేకాదు, తాను ఇప్పటికీ పార్టీకి అందుబాటులోనే ఉన్నానని చెబుతూనే తన అవసరం లేదని పార్టీ భావిస్తే తనకూ వేరే మార్గాలు ఉన్నాయని ఆ తర్వాత స్పష్టంగా హెచ్చరించారు. అంటే థరూర్ ధిక్కార ధోరణి మొదలయ్యిందనే చెప్పాలి. ఇక్కడ ఒక్క థరూర్ మాత్రమే మనకు పైకి కనిపిస్తున్నారు. కానీ కాగ్రెస్ పుట్టి ముంచడానికి అనేకులు సిద్దంగా ఉండివుంటారు. కాంగ్రెస్‌కు బీటల వేయడంలో థరూర్ అడుగు వేస్తే మరికొందరు ముందుకు రావచ్చు. మహారాష్ట్ర తరహాలో కాంగ్రెస్ చీలిక అని వార్యం కావచ్చు. మోడీ ద్వయం ప్రశాంతతకు ఇది కారణం కూడా కావచ్చు. రాజకీయాల్లో ఏదైనా జరగవచ్చు. జమిలి ఎన్నికలు, ఉమ్మడి పౌరస్మృతి వంటి సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో తమ పీఠాన్ని బలోపేతం చేసుకునే పనిలో మోడీ ద్వయం ఏమైనా చేసే అవకాశం ఉంది.

# కుంభమేళాలో హరమరమహదేవ్










## భారీగా తరలివచ్చిన భక్తజనం

### చివరిరోజు..శివరాత్రి కావడంతో పుణ్యస్నానాలు

**ప్రయాగ్‌రాజ్:** ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవంగా మొదలైన మహాకుంభమేళాకు చివరి రోజు కావడంతో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారు. మహాశివరాత్రి కావడంతో భక్తులు పుణ్యస్నానాలకు పోటెత్తారు. పుణ్యతిథి కావడంతో భారీగా భక్తుల తరలివచ్చారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక వేడుక ఇక ముగియనుంది. ఈక్రమంలో బుధవారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. 'హర హర మహాదేవ్' నామస్మరణలతో త్రివేణీ సంగమం ఘాట్లు మార్మోగాయి. ఇప్పటివరకు 64 కోట్ల మంది భక్తులు వచ్చినట్లు రాష్ట్రప్రభుత్వం పేర్కొంది. ఈ కుంభమేళాలో నేడు చివరి అమృత్ స్నానం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లుచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అధికారులు భక్తులకు ప్రత్యేక సూచనలు జారీ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలని కోరారు. ఇక, ఈ ఏర్పాట్లను గోరఖ్‌నాథ్ కంట్రోల్ రూమ్ నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షించారు. ఇదిలాఉండగా.. కొన్నిరోజుల క్రితం మౌని అమావాస్య, వసంత పంచమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తులు పెద్దఎత్తున పోటెత్తడంతో ప్రయాగ్‌రాజ్ మార్గంలోని జాతీయరహదారిపై సుమారు 350 కి.మీ. పొడవునా వాహనాలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈసారి భక్తులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోకుండా ఉండేందుకు కుంభమేళా ప్రాంతాన్ని నో వెహికల్ జోన్ గా అధికారులు ప్రకటించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి దీన్ని అమలు చేశారు. స్థానికుల కోసం నిత్యావసర సరకులు తీసుకొచ్చే వాహనాలను మాత్రమే అనుమతించారు. కుంభమేళా ముగిశాక భక్తులు క్షేమంగా తిరుగు పయనం అయ్యేలా ప్రయాగ్‌రాజ్ నుంచి దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు బుధవారం 350 రైళ్లను రైల్వేశాఖ నడుపుతోంది. జనవరి 13న ప్రారంభమైన ఈ కుంభమేళా దాదాపు 45 రోజులుగా కొన సాగుతోంది. ఇప్పటికే రికార్డ్ స్థాయిలో 63.36 కోట్ల మందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద ఉత్సవంగా కుంభమేళా నిలిచింది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం దగ్గర కోట్లాది మంది భక్తులంతా పుణ్యస్నానాలు ఆచరించారు. ఇదిలా ఉంటే ఈ కుంభమేళాకు యూపీ ప్రభుత్వం ప్రగడ్బందీగా ఏర్పాట్లు చేసింది. తాత్కాలిక గుడారాలు, టాయిలెట్లు ఏర్పాటు చేసింది. అలాగే ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా పారిశుద్ధ్య కార్మికులను ఏర్పాటు చేసింది. ఇక తప్పిపోయిన వారి సమాచారం తెలియజేసేందుకు 24 గంటలు సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా వైద్య సౌకర్యాలు కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇక ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి ఈ కుంభమేళా జరుగుతుంది.

ఈ-కబురు
27-2-2025
గురువారం
e-kaburu.com

# రాజ్యసభ బరిలో కేజ్రీవాల్

### పంజాబ్ నుంచి నామినేట్ అయ్యే ఛాన్స్

### జోరుగా మీడియా కథనాలు...కొట్టి పారేసిన ఆప్



**న్యూఢిల్లీ:** ఢిల్లీలో అధికారం కోల్పోవడంతో ఆప్ అధినేత కేజ్రీవాల్ రాజకీయంగా బలంగా మారేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. అందుకు పార్లమెంట్‌ను వేదిక చేసుకునే అవకాశాలు ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. ఢిల్లీలో ఇప్పటికిప్పుడు చేసేదేమీ లేదు. పంజాబ్ సిఎం అవుతారంటూ ఇటీవల కొన్ని కథనాలు వచ్చాయి. అయితే అలాంటి సాహసం చేసి పార్టీ పరువును తీసుకునే ప్రయత్నం చేయకపోవచ్చు. మోఢీని ఢీకొనాలంటే పార్లమెంటులో ఉండాలన్న యోచనలో ఉండివుండవచ్చు. ఈ క్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇక పార్లమెంట్‌లో అడుగుపెట్టనున్నారన్న ప్రచారం ఒకటి చక్కర్లుకొడుతోంది. పార్టీలో తాజా పరిణామాలతో ఈ ప్రచారం జోరందుకుంది. ఆయనను త్వరలోనే రాజ్యసభకు పంపించేందుకు ఆప్ ముమ్మర సన్నాహాలు చేస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అయితే, వీటిని పార్టీ తోసిపుచ్చింది.ప్రస్తుతం రాజ్యసభలో ఉన్న ఆప్ ఎంపీ సంజీవ్ అరోఢాను పార్టీ పంజాబ్ ఉప ఎన్నికల బరిలో నిలబెట్టింది. త్వరలో జరగబోయే లూథియానా వెస్ట్ అసెంబ్లీ ఉప ఎన్నికకు అభ్యర్థిగా సంజీవ్ పేరును ఖరారు చేస్తూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దీంతో కేజ్రీవాల్ పార్లమెంట్ ప్రవేశంపై వార్తలు గుప్పుమన్నాయి. సంజీవ్ అరోఢా 2022లో పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆయన పదవీకాలం 2028లో ముగియనుంది. కాగా.. లూథియానా వెస్ట్ నుంచి ఎన్నికైన ఆప్ ఎమ్మెల్యే గుర్‌ప్రీత్ గోగి గత నెల మరణించడంతో ఈ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో పార్టీ సంజీవ్‌ను బరిలోకి దించింది. ఉప ఎన్నికల్లో ఆయన గెలుపొందే అవకాశాలు ఎక్కువే ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఆయన ఎమ్మెల్యేగా గెలిచి, ఆ పదవిలో కొనసాగాలనుకుంటే.. రాజ్యసభ సభ్యత్వాన్ని ఖాళీ చేయాల్సి ఉంటుంది. అప్పుడు పెద్దల సభలో ఖాళీ అయ్యే ఆ స్థానానికి కేజ్రీవాల్‌ను పంపించాలని ఆప్ భావిస్తున్నట్లు పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి.అయితే, ఈ ప్రచారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ఖండించింది. అవన్నీ వదంతులేనని ఆప్ పంజాబ్ విభాగ అధికార ప్రతినిధి జగ్తర్ సింగ్ వెల్లడించారు. కేజ్రీవాల్‌ను రాజ్యసభకు పంపించే అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా ఈ ప్రచారం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఇక, ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ ఓటమిపాలైన సంగతి తెలిసిందే. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన పార్టీ అధినేత కేజ్రీవాల్ కూడా ఓడిపోయారు. ఆయన పోటీ చేసిన న్యూదిల్లీ శాసనసభ నియోజకవర్గం నుంచి భాజపా నేత పర్వేశ్‌వర్మ విజయం సాధించారు. ప్రస్తుతం దిల్లీ అసెంబ్లీలో మాజీ సీఎం ఆతిశీ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. ఈక్రమంలో పార్లమెంటులో ఉండడమే శ్రేయస్కరమని కేజ్రీవాల్ భావిస్తున్నారు. లేకుంటే పార్టీని కాపాడుకోవడం కష్టం కావచ్చు.

## నేడు తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికలు

**హైదరాబాద్:** తెలంగాణలో 27న జరుగనున్న గ్రాడ్యుయేట్, టీచర్ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఈ ఎన్నికలు జరుగతనున్నాయి. 7 ఉమ్మడి జిల్లాల్లో ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. పోలింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది ఎన్నికల సంఘం. ఈ క్రమంలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించారు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఇలా త్రిపాఠి. ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా పాత 3 జిల్లాలు, కొత్తగా ఏర్పడ్డ 12 జిల్లాల అధికారుల కోఆర్డినేషన్ బాగుందని.. ఇప్పటివరకు వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తామని అన్నారు. సుమారు రెండు వేల మంది సిబ్బందితో ఎన్నికలు నిర్వహణ జరుగుతుందని అన్నారు త్రిపాఠి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 25,797 మంది ఓటర్లు ఉండగా.. 200 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వెబ్ క్యామ్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని.. ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తామని అన్నారు. దాదాపు 1100 మందిని ఎన్నికల నిర్వహణ కోసం కేవలం పోలింగ్ కేంద్రాల్లోనే ఏర్పాటు చేశామని అన్నారు.విద్యావంతులైన ఉపాధ్యాయులు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు త్రిపాఠి. ఇలా త్రిపాఠితో పాటు పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడూతూ.. దాదాపు వేయి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. డిస్టిబ్యూషన్ సెంటర్ నుంచి పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో వెళ్లేటప్పటి నుంచి తిరిగి రిసెప్షన్ సెంటర్‌కు వచ్చే వరకు పోలీసుల భద్రత ఉంటుందని అన్నారు.వాహనం వెంట సెక్యూరిటీ కూడా నల్లగొండ జిల్లా పోలీసులే ఉంటారని.. బయటి జిల్లాల నుంచి బ్యాలెట్ పేపర్లను తరలించేటప్పుడు జిపిఎస్ సిస్టం పరిశీలిస్తూ సెక్యూరిటీ ద్వారా తీసుకొస్తామని తెలిపారు. పోలింగ్ అనంతరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు సంబంధించిన అన్ని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని రిసెప్షన్ సెంటర్‌కు తీసుకొస్తామని.. ఆ తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన స్టాం÷-రగ్ రూమ్‌ల్లో పొలిటికల్ ప్రజాప్రతినిధుల సమక్షంలో భద్రపరుస్తామని అన్నారు. స్టాం÷-రగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఉంటుందని అన్నారు ఎస్పీ శరత్ చంద్ర పవార్.

## విజయవాడ ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

**విజయవాడ:** మహాశివరాత్రి సందర్భంగా పలు శైవక్షేత్రాలు శివ భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజాము నుంచే భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతున్నాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరి ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మవారి సమీపంలోని భవాని జల శివాలయంలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే కృష్ణా నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. యనమలకుదురు శివాలయంలో తెల్లవారుజాము నుంచి గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. మహాశివరాత్రి సందర్భంగా యనమలకుదురు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

# జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన

### దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్




**హైదరాబాద్:** నియోజకవర్గాల పునర్విభజన విషయంలో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాలను పునర్విభజించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం తెలంగాణతో సహా ఇతర దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళలకు శాపంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ విషయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సామాజిక మాధ్యమాల్లో వ్యక్తం చేసిన ఆందోళనలతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని కేటీఆర్ తెలిపారు. దేశ సంక్షేమం కోసం జనాభా నియంత్రణను ఒక యజ్ఞంలా భావించి, దాన్ని విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం శిక్షించాలని చూస్తోందా అని కేటీఆర్ ప్రశ్నించారు. 'జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు చేసిన కృషిని పట్టించుకోకుండా, కేవలం జనాభా ఆధారంగా నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం' అని ఆయన మండిపడ్డారు. దక్షిణాది రాష్ట్రాలు దేశ నిర్మాణంలో అందించిన సహకారాన్ని ఎవరూ కాదనలేరని ఆయన అన్నారు. '1951లో దక్షిణాది రాష్ట్రాల జనాభా వాటా 26.2 శాతం ఉండగా, 2022 నాటికి అది 19.8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి ఉత్తర రాష్ట్రాల జనాభా వాటా 39.1 శాతం నుంచి 43.2 శాతానికి పెరిగింది. ఈ పరిస్థితుల్లో జనాభా ఆధారంగా లోక్‌సభ సీట్లను నిర్ణయిస్తే, ఉత్తరప్రదేశ్ మరియు బిహార్‌లకు కలిపి 222 సీట్లు వస్తాయి, అయితే ఐదు దక్షిణాది రాష్ట్రాలకు కలిపి కేవలం 165 సీట్లు మాత్రమే లభిస్తాయి' అని కేటీఆర్ వివరించారు. 'దక్షిణాది రాష్ట్రాలు ఆర్థిక వృద్ధి, మానవ అభివృద్ధి సూచికలు, జనాభా నియంత్రణ వంటి అన్ని రంగాల్లో ఉత్తర రాష్ట్రాల కంటే గణనీయంగా మెరుగైన పనితీరు కనబరిచాయి. అలాంటి రాష్ట్రాలను శిక్షించి, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించడం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకం' అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా కంటే ఆర్థిక సహకారాన్ని ప్రాతిపాదికగా తీసుకోవాలని కేటీఆర్ ప్రతిపాదించారు. 'తెలంగాణ జనాభా దేశ జనాభాలో కేవలం 2.8 శాతం మాత్రమే ఉన్నప్పటికీ, దేశ జీడీపీలో 5.2 శాతం కంటే ఎక్కువ సహకారం అందిస్తోంది. ఇదే విధంగా దక్షిణాది రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అపారమైన సహకారం అందిస్తున్నాయి. కాబట్టి నియోజకవర్గాల పునర్విభజనలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలి' అని కేటీఆర్ సూచించారు.

# దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినం

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మహా శివరాత్రి పర్వదినాన్ని ప్రజలు మహా వేడుకగా జరుపుకున్నారు. దేశంలోని అన్ని శైవాలయాలు, జ్యోతిర్లింగాలు.. శివ భక్తులతో నిండిపోయాయి. తెల్లవారుజాము నుంచే ప్రధాన ఆలయాల్లో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.వారణాసి, ఉజ్జయిని, సోమ్‌నాథ్ వంటి ప్రధాన శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోరక్‌పూర్‌లో సిఎం యోగి ఆదిత్యనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దంపతులు ఉజ్జయినిలోని మహాకాలేశ్వర్ ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు చేశారు. ఆ ఆలయంలో ఇవాళ తెల్లవారు జామున భస్మహారతి నిర్వహించారు. ఆ తర్వాత మహాకాలుడిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. వారణాసిలోని కాశీ విశ్వనాథుడికి ఇవాళ ఉదయం ప్రత్యేక హారతి ఇచ్చారు. కాశీలో వేల సంఖ్యలో భక్తులు విశ్వనాథుడి దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. సుమారు అయిదు కిలోమీటర్ల మేర అక్కడ భక్తులు క్యూ కట్టనట్లు తెలుస్తోంది. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద భక్తులు పవిత్ర స్నానాలు చేశారు. ఢిల్లీలోని గౌరీశంకర్ ఆలయానికి భక్తుల తాకిడి పెరిగింది. హరిద్వార్‌లోని ధాకేశ్వర్ మహాదేవ్ ఆలయం వద్ద భక్తులు భారీ క్యూలైన్ కట్టారు. మహారాష్ట్రలోని త్రయంబకేశ్వర్ ఆలయాన్ని విద్యుత్తు దీపాలతో అలంకరించారు. శివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో త్రినేత్రుడి దర్శనం చేసుకుంటున్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు లక్షల సంఖ్యలో హాజరయ్యారు. జార్ఖండ్‌లోని దేవ్‌ఘర్‌లో ఉన్న జ్యోతిర్లింగ క్షేత్రమైన బాబా బైద్యనాథ్ ఆలయంలో కూడా భక్తులు కిటకిటలాడిపోయారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళలోని కొచ్చిలో ఉన్న అలువ మహాదేవ్ ఆలయానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

# కేరళ రాజకీయాలకు చేరువవుతున్న శశిధరూర్



**తిరువనంతపురం:** కేరళ రాజకీయాల్లో కీలక భూమిక పోషించేందుకు కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ రాజకీయంగా పావులు కదుపుతున్నారా అన్న చర్చ మొదలయ్యింది. ఇక్కడ సొంతంగా ఇమేజ్ ఉన్న నేతగా శశిథరూర్ ప్రయత్నాలు మొదలు పెట్టారని అనుకుంటున్నారు. అదే నిజమైతే ఓ ప్రాంతీయ పార్టీతో థరూర్ ముందుకు రావచ్చని ప్రచారం సాగుతోంది. ఇందుకు బిజెపి తెరవేనక మంత్రాంగం నడపనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాది కేరళ అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. పార్టీకి సాంప్రదాయకంగా లభించే ఓట్లు మాత్రమే కాకుండా, కాంగ్రెస్ వ్యతిరేక ఓటర్లను సైతం ఆకర్షించగల సత్తా శశిథరూర్‌కు ఉంది. కేరళలో సొంతంగా ఇమేజ్ గల ఏకైక కాంగ్రెస్ నేత ఆయనే అని చెప్పవచ్చు. నాలుగు దశాబ్దాల కేరళ చరిత్రలో తొలిసారి అధికార పార్టీ గెలుపొందిన ఘనతతో పదేళ్ళపాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న సిపిఎం నేత పి విజయన్‌కు వచ్చే ఏడాది ఎన్నికలు ప్రతికూలంగా ఉండే అవకాశం ఉన్నట్లు పలువురు భావిస్తున్నారు. ఇప్పటికే పినరయ్ పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. అటువంటి సమయంలో శశిథరూర్ పార్టీపై తిరుగుబాటు చేసి, బయటకు వస్తే అధికారంలోకి వస్తామని ఎదురు చూస్తున్న కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌కు గడ్డు పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. తనకు వేరే ఆప్షన్లు ఉన్నాయని శశిథరూర్ చెప్పడం వెనుక బలమైన కారణాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆయనకు ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో, విద్యావంతులలో మంచి ఆదరణ లభించే అవకాశం ఉంది. వామపక్ష కూటమి సైతం ఆయనతో పొత్తుకు సిద్ధం కావచ్చు. ఏదిఏమైనా ఈ విషయంలో శశి థరూర్ ఆలోచనలు, ప్రాధాన్యతలు వెల్లడి కావాల్సి ఉంది. ఆయన తిరుగుబాటు జరిపితే కేరళలో కాంగ్రెస్ కూటమికి కోలుకోలేని దెబ్బతీసే అవకాశం ఉంది. మరో వంక తొలిసారి గత ఏడాది కేరళలో ఒక లోక్‌సభ స్థానం గెల్చుకున్న బిజెపి ప్రజాదరణ గల నాయకుడి కోసం అన్వేషిస్తున్నది. శశిథరూర్ అమెరికా పర్యటనలో ఉన్న సమయంలోనే ప్రధాని మోడీకి సన్నిహితులైన కొందరు కలిసి, ఈ విషయమై చర్చలు జరిపారని తెలుస్తున్నది. మరో వంక హోం మంత్రి అమిత్ షా సైతం ఆయనతో సంప్రదింపులతో ఉన్నట్లు చెబుతున్నారు. అదే సమయంలో శశిథరూర్‌ను ఓ ప్రాంతీయ పార్టీ ఏర్పాటు చేయమని కూడా కొందరు ఒత్తిడి చేస్తున్నారు. ప్రస్తుతం 'ఇండియా' కూటమిలో ఉన్న ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్ ను నెట్టివేసి ప్రయత్నంలో ఉన్నందున ఆయనను కలుపుకొని అవకాశం ఉంది. శశిథరూర్ ప్రభావం కేవలం కేరళకు మాత్రమే పరిమితం కాకపోవచ్చు. మొత్తం రాహుల్ గాంధీ నాయకత్వాన్ని సవాల్ చేసే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉంది. ఇకపోతే తాజా రాజకీయ దుమారంలో శశిథరూర్ స్పందించారు. తాజాగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ ప్రశంసించడమే కాక.. కేంద్ర మంత్రి పియూష్ గోయెల్‌తో ఆయన సెల్ఫీ దిగి సోషల్‌మీడియాలో పోస్ట్ చేశారు. దీంతో ఆయన కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలో చేరుతారనే వార్తలు వైరల్ అయ్యాయి. ఈ వార్తలపై శశిథరూర్ స్పష్టత ఇచ్చారు.

## పొట్లపల్లి శివాలయంలో మంత్రి పొన్నం పూజలు

**సిద్దిపేట:** మహాశివరాత్రి సందర్భంగా జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లిలో మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీ స్వయంభూ రాజేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించి.. ప్రత్యేక పూజలు చేశారు. తెలుగు ప్రజలు అందరూ క్షేమంగా ఉండాలని శివపార్వతులను కోరుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరత్వరగా క్యూ లైన్‌లలో దర్శనానికి పంపించాలని అధికారులకు సూచించారు. మంత్రి పొన్నం ఆలయంలోని భక్తులతో ముచ్చటించి.. అక్కడే ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌లో హెల్త్ చెకప్ చెపించుకున్నారు.దర్శనం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ 'పొట్లపల్లి స్వయం భూ రాజరాజేశ్వర స్వామి వారిని హుస్నాబాద్ ప్రాంతం వారే కాదు.. ఇతర జిల్లాల వారు కూడా పెద్ద ఎత్తున దర్శించుకుంటారు. మహాశివరాత్రి సందర్భంగా అధికారులు ముందే సమీక్షా సమావేశాలు ఏర్పాటు చేసుకొని అన్ని ఏర్పాట్లు చేశారు. భవిష్యత్తులో దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం. 20 సంవత్సరాలుగా పొట్లపల్లి శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని ప్రతి శివరాత్రికి దర్శించుకుంటున్నానని అన్నరు. ఈసారి ఆరెపల్లి నుండి పందిల్ల వరకు వయా పొట్లపల్లి మీదుగా డబుల్ రోడ్డు వేయించాం. భక్తులకు శాశ్వత డ్రింకింగ్ వాటర్ అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. ఈ ప్రాంతం అంతా ప్రాజెక్టులు పూర్తయి.. మంచి పంటలతో సుభిక్షంగా ఉంచాలని స్వామి వారిని వేడుకున్నానని తెలిపారు.

## ప్రకాశంలో ఆలయాలకు పోటెత్తిన భక్తులు

**ఒంగోలు:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలో తెల్లవారుజాము నుండే శైవాలయాలకు భక్తుల రద్దీ అధికంగా ఉంది. శివనామస్మరణలతో ఆలయాలు మార్మోగుతున్నాయి. ఒంగోలు సంతపేట సాయిబాబా ఆలయంలో ఏర్పాటు చేసిన శివలింగాన్ని దర్శనం చేసుకునేందుకు భక్తులు బారులు తీరారు. త్రిపురాంతకం, భైరవకోన, మణికేశ్వరం, సోపిరాల, మిట్టపాలెం నారాయణస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

## ప్రజలకు చంద్రబాబు శుభాకాంక్షలు

**అమరావతి:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రజలందరికీ టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరికీ మహాశివరాత్రి శుభాకాంక్షలు. నిరాడంబరుడు, భోళాశంకరుడు, గరళకంఠుడు అని ఆ శివుడికి పేర్లు. ఇవన్నీ కూడా మన భారతీయుల గొప్ప లక్షణాలకు, ఉత్తమ సంస్కృతికి నిదర్శనాలు. భక్తిశ్రద్ధలతో శివరాత్రిని జరుపుకుంటున్న భక్తులందరికీ ఆ ఈశ్వర కటాక్షం కలగాలని కోరుకుంటున్నాను' అంటూ చంద్రబాబు ట్వీట్ చేశారు.

## శ్రీకాళహస్తికి పోటెత్తిన భక్త జనం

**శ్రీకాళహస్తి:** దక్షిణ కైలాసంగా.. వాయులింగ క్షేత్రంగా పూజలు అందుకుంటున్న శ్రీకాళహస్తిలోని శ్రీజ్ఞాన ప్రసూనాంబిక సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు అంగరంగ వైభంగా సాగాయి. తెల్లవారుజామున 2.30గంటల నుంచే భక్తులు కాళ హస్తీశ్వరుని దర్శనం కోసం బారులు తీరారు. మహా శివరాత్రిని పురస్కరించుకొని స్వామి వారికి ఏకాదశ అభిషేకాలు నిర్వహించారు. అభిషేక ప్రియుడైన మహా దేవుణ్ని దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ మండపాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఇందుకోసం ప్రత్యేకంగా పండ్లు..పూలను తీసుకొచ్చి అలంకరింపజేశారు. విద్యుద్దీప కాంతులతో ఆలయ పరిసరాలన్నీ మిరుమిట్లు గొల్పుతున్నాయి. శివరాత్రి పర్వదినాన స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు ..రథోత్సవం, కల్యాణోత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు.

## ఉమ్మడి జిల్లాలో పోటెత్తిన భక్తులు

**వరంగల్:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని ఆలయాలకు శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంది. శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. కొన్ని ఆలయాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేశారు. దర్శనాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా సౌకర్యాలు చేశారు. హనుమకొండలోని వేయిస్తంభాలగుడి, కాజీపేట మడికొండలోని మెట్టుగుట్ట, వరంగల్లోని భద్రకాళి ఆలయం, కాశీబుగ్గలోని కాశీ విశ్వేశ్వరాలయం భక్తులతో రద్దీగా మారింది. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం రామప్పలోని రామలింగేశ్వర క్షేత్రం, మహబూబాబాద్ జిల్లా కురవి వీరభద్రుడి సన్నిధి, భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని త్రివేణి సంగమ తీరం, కాళేశ్వర ముక్తీశ్వర సన్నిధానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శైవక్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగుతున్నాయి.

## ఉమ్మడి జిల్లాలో శివనామస్మరణం

**నల్లగొండ:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. రామలింగేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో శివరాత్రి శోభ సంతరించుకుంది. శైవక్షుత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నల్లగొండ జిల్లాలోని శైవక్షేత్రాల్లో భక్తుల సందడి నెలకొంది. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చెర్వుగట్టు, పానగల్, వాడపల్లి ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది.సూర్యాపేట జిల్లాలో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పిల్లలమర్రి, నాగులపాటి అన్నారంలోని ప్రాచీన శివాలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతోంది. మేళ్లచెరువు శ్రీస్వయంభూ శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పిల్లలమర్రి, నాగులపాటి అన్నారం, మెళ్లచెర్వు శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయాల్లో తెల్లవారు జాము నుంచే భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తెల్లవారుజాము నుంచే శివాలయాల్లో భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నల్గొండలోని పురాతన ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సూర్యాపేట పిల్లలమర్రి, మేళ్ల చెర్వు స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వర స్వామి, వాడపల్లి ఆగస్తేశ్వర స్వామి దేవాలయాలల్లో భక్తులు పూజలు

## అన్నమయ్య జిల్లాలో ఏనుగుల బీభత్సం

**మదనపల్లె:** అన్నమయ్య జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఓబులవారిపల్లె మండలం గుండాలకోన వద్ద భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో ముగ్గురు భక్తులు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. శివరాత్రిని పురస్కరించుకుని వై.కోటకు చెందిన భక్తులు ఆలయానికి నడుచుకుని వెళ్తుండగా వారిపై ఏనుగులు దాడి చేశాయి. మృతులను వంకాయల దినేష్, తుపాకుల మణమ్మ, చంగల్ రాయుడుగా గుర్తించారు. ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని సీఎం ప్రకటించారు. ఏనుగుల దాడి ఘటనపై డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ స్పందించారు. ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షలు, తీవ్రంగా గాయపడినవారికి రూ.5లక్షల పరిహారం ప్రకటించారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌ను వై.కోటకు వెళ్లాలని పవన్ ఆదేశించారు. అసెంబ్లీ నుంచి హుటాహుటిన అక్కడికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించాలన్నారు. దీనిపై సమగ్ర నివేదిక అందజేయాలని అటవీశాఖ అధికారులను పవన్ ఆదేశించారు.

## ఎపిలోనూ జన కులగణన చేపట్టండి

### చంద్రబాబు, పవన్‌లను కోరిన విహెచ్

**అమరావతి:** తెలంగాణ తరహాలో ఎపిలోనూ కులగణన చేపట్టాలని కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లను కలిశారు. జనగణన కుల ప్రాతిపదికన జరగాలని కోరారు. అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ప్రధాని మోడీతో సత్సంబంధాలు ఉన్నాయి.. కచ్చితంగా కుల ప్రాతిపదికన జనగణనపైన మోడీతో చర్చించాలని హనుమంతరావు కోరారు. తెలంగాణ సీఎంరేవంత్ రెడ్డి ఇప్పటికే తెలంగాణలో జనగణన ప్రారంభించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ.. చంద్రబాబు, పవన్‌లను కుల ప్రాతిపదికన జనగణన చేయాలని కోరడానికి కలిశానని తెలిపారు. బీసీలకు ప్రత్యేక అవకాశాలు కల్పించాలని అడిగానన్నారు. కర్నూలు దగ్గర పెదపాడు గ్రామానికి దామోదర సంజీవయ్య పేరు పెట్టాలి.. ఆ ప్రాంతంలో స్మృతి వనం కట్టాలని వీహెచ్ పేర్కొన్నారు. అందుకోసం పవన్ కళ్యాణ్ కోటి రూపాయల విరాళం ఇచ్చారని తెలిపారు. మరోవైపు.. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదని వీహెచ్ ఆరోపించారు. నీతి నిజాయితీ కలిగిన వ్యక్తి.. చనిపోయినప్పుడు కూడా సొంత ఇల్లు లేదని అన్నారు. ఆయనకి న్యాయం జరగాలని వి.హనుమంతరావు కోరారు. రాజకీయలలో డబ్బులు సంపాదించడం ఒక సిస్టం అయ్యింది.. పవన్ చొరవ తీసుకోవాలి, సహకరించాలన్నారు. మరోవైపు.. జనగణనతో పాటు కులగణన కూడా జరగాలి పవన్‌ని కోరుతున్నానన్నారు. ఏపీలో కాంగ్రెస్ భవిష్యత్తులో అధికారంలోకి వస్తుందని వీహెచ్ తెలిపారు.

## భర్త పుణ్యస్నానం కోసం భార్య విన్యాసం

**ప్రయాగ్‌రాజ్:** ప్రయాగ్‌రాజ్‌లో అత్యంత వైభవోపేతంగా కొనసాగుతోన్న కుంభమేళా తుది దశకు చేరుకున్న వేళ..ఓ విచిత్ర ఘటన చోటు చేసుకుంది. నేటితో ముగియనున్న ఆధ్యాత్మిక వేడుకకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది తరలి వచ్చి పవిత్రస్నానాలు ఆచరిస్తున్నారు. కన్నుల పండువగా కొనసాగుతోన్న ఈ కార్యక్రమానికి స్వయంగా హాజరుకాలేకపోయిన తమ వారి కోసం పలువురు తమ సృజనాత్మకతకు పదును పెడుతూ చేస్తోన్న వినూత్న చర్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇటీవల కొందరు తమ కుటుంబ సభ్యుల ఫొటోలను పవిత్ర సంగమంలో ముంచగా.. మరికొందరు తమవారి పేర్లను చెబుతూ పుణ్యస్నానాలు చేయిస్తున్నారు. తాజాగా ఓ మహిళ చేసిన అసాధారణ చర్యకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. మహా కుంభమేళాకు వెళ్లిన ఓ మహిళ అక్కడి నుంచి తన భర్తకు వీడియో కాల్ చేశారు. ఆ తర్వాత ఫోన్‌ను పలుమార్లు నీటిలో ముంచి తీస్తున్న దృశ్యాలు ఈ వీడియోలో రికార్డయ్యాయి. తద్వారా తన భర్తకు పవిత్ర సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన అనుభవాన్ని మిగిల్చేందుకు ప్రయత్నించిన ఆ మహిళ ఆలోచన పట్ల నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కొందరు ఆమె చర్య వెనుక వున్న తర్కాన్ని ప్రశ్నిస్తుండగా.. ఇంకొందరు ఫోన్ నీటిలోకి జారిపోయి ఉంటే..! అని సరదా కామెంట్లు పెట్టారు. ఇంకొందరైతే ఈ వేడుకకు వెళ్లలేని ఫ్రెండ్స్‌ను ట్యాగ్ చేసి.. ఇదే పద్ధతి ప్రయత్నించాలంటూ సరదాగా సూచిస్తున్నారు.

## కాగ్ నివేదికపై సిబిఐ విచారణ చేయించండి

**న్యూఢిల్లీ:** ఆమ్‌ఆద్మీ అధికారంలో ఉన్న 2021-22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా దిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ రూపొందించిన నివేదికపై ప్రతిపక్ష నేత ఆతిశీ స్పందించారు. దీనిపై సిబిఐ విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. కాగ్ నివేదికలోని ఎనిమిది చాప్టర్లలో ఏడు చాప్టర్లు తాము అధికారంలోకి రాకముందు రూపొందించిన పాత మద్యం విధానానికి సంబంధించినవే ఉన్నాయని పేర్కొన్నారు. పొరుగు రాష్ట్రాలైన హరాయాణా ఉత్తరప్రదేశ్ నుంచి మద్యం తీసుకురావడం వల్లే దిల్లీ ప్రజలు నష్టపోయారన్నారు. 'నేడు అసెంబ్లీలో ఎక్సైజ్ ఆడిట్ నివేదికను సమర్పించారు. ఇందులో ఏడు చాప్టర్లు 2017-21 ఎక్సైజ్ పాలసీకి సంబంధించినవి. ఒక్కటి మాత్రమే ఆప్ ప్రభుత్వం చేపట్టిన నూతన మద్యం పాలసీకి చెందినది. పాత ఎక్సైజ్ పాలసీలోని లోపాలను, అవినీతిని ఈ నివేదిక ప్రజలకు బహిర్గతం చేసింది. 28 శాతానికి పైగా అవినీతి కాంట్రాక్టర్ల ద్వారా జరిగిందని, డబ్బు దళారీల జేబుల్లోకి వెళ్లిందని ఈ నివేదిక వెల్లడించింది. మద్యం కాంట్రాక్టులు ఏ పార్టీ నేతలకు చెందిన వారికి వెళ్లాయో కూడా స్పష్టం చేసిందని ఆతిశీ పేర్కొన్నారు. ఈ నివేదికలను ఆధారంగా చేసుకొని మద్యం కుంభకోణంపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. 2021-22లో తీసుకొచ్చిన మద్యం విధానం కారణంగా దిల్లీ ప్రభుత్వానికి రూ.2000 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కాగ్ తేల్చింది. కొత్త మద్యం విధానం కారణంగా అప్పటి ప్రభుత్వం రూ.941.53 కోట్ల ఆదాయం కోల్పోయిందని నివేదికలో పేర్కొంది. ఇక, లైసెన్సు ఫీజుల కింద మరో రూ.890.15 కోట్లు నష్టపోయినట్లు తెలిపింది. లైసెన్సుదారులకు మినహాయింపుల రూపంలో మరో రూ.144 కోట్లు కోల్పోయినట్లు వెల్లడించింది. కాగా దీనికి ఆప్ నేతలు వ్యతిరేకించారు.

# కష్టాల జర్మనీకి కొత్త సారథ్యం




బహుముఖ సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతున్న జర్మనీ ఆదివారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో మితవాదపక్షాల వైపు మొగ్గింది. 1990లో జర్మనీ ఏకీకరణ తర్వాత కనీవినీ ఎరుగని రీతిలో 83.5 శాతం పోలింగ్ నమోదు కాగా మధ్యేవాద మితవాదులైన క్రిస్టియన్ డెమాక్రాటిక్ యూనియన్ (సీడీయూ), క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సీఎస్‌యూ) పార్టీలు రెండింటికీ కలిపి 208 స్థానాలు వచ్చాయి. పోలైన వోట్లలో ఆ రెండు పార్టీలూ 28.6 శాతం గెల్చుకోగా, తీవ్ర మితవాద పక్షం ఆల్టర్నే టివ్ ఫర్ జర్మనీ (ఏఎఫ్‌డీ) 20.8 శాతంతో రెండో స్థానానికి చేరుకోవటం అందరినీ కలవర పరుస్తోంది. ఆ పార్టీకి 132 స్థానాలు లభించాయి. 2021తో పోలిస్తే దాని వోటింగ్ శాతం రెట్టింప యింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అనుచరగణం అత్యుత్సాహం ప్రదర్శించి జర్మనీ ఎన్నికల్లో జోక్యం చేసుకోనట్టయితే ఏఎఫ్‌డీ వైపు మరింత శాతం మంది మొగ్గుచూపేవారన్నది ఎన్నికల నిపుణుల అంచనా. ఇంతవరకూ పాలించిన కూటమికి నేతృత్వం వహించిన సోషల్ డెమాక్రాటిక్ పార్టీ (ఎస్‌పీడీ) 16.4 శాతం వోట్లతో, 120 సీట్లతో మూడో స్థానానికి పరిమితమైంది. కానీ పార్లమెంటులోని 630 స్థానాల్లో ప్రభుత్వం ఏర్పర్చటానికి కావాల్సిన 316 స్థానాలు సీడీయూ, సీఎస్ యూలకు లేవు గనుక అనివార్యంగా ఎస్‌పీడీతో చేతులు కలపాల్సి వుంటుంది. తమకు ప్రభుత్వంలో కొనసాగే ఉద్దేశం లేదని ఎస్‌పీడీ చెబుతున్నా అంతకుమించి దానికి వేరే ప్రత్యామ్నాయం లేదు. ఇప్పటికీ ప్రధాన స్రవంతి పక్షాల వైపే వోటర్లు మొగ్గుచూపుతున్నట్టు తేలినా వాటి బలం గణనీ యంగా పడిపోయిందని ఫలితాలు వెల్లడిస్తున్నాయి. యువత, మహిళలు ప్రధానంగా ఎస్‌పీడీ, గ్రీన్ పార్టీ, వామపక్షాల వైపు మొగ్గటం గమనించదగ్గ అంశం. యువతలో ఏఎఫ్‌డీ ప్రభావం కూడా పెరిగింది. ప్రాంతాలవారీగా చూస్తే గతంలో కమ్యూనిస్టుల ప్రాబల్యంవున్న తూర్పు జర్మనీ ప్రాంత రాష్ట్రాల్లో ఏఎఫ్‌డీ బలమైన శక్తిగా ఎదిగినట్టు కనబడుతోంది. పశ్చిమ ప్రాంతంలో సీడీయూ, సీఎస్ యూలు ఆధిక్యత సాధించాయి. తూర్పు, పశ్చిమ ప్రాంతాల మిశ్రమంగావున్న బెర్లిన్ ఒక్కటే ఇందుకు మినహాయింపు. అక్కడ వామపక్ష పార్టీకి అత్యధిక వోట్లు వచ్చాయి. ఈ ఫలితాలు వెల్లడిస్తున్న మరో కీలకాంశం దేశం ప్రాంతాలవారీగా విడిపోయిందన్నదే. తమను దేశంలో ద్వితీయ శ్రేణి పౌరు లుగా చూస్తున్నారని, వలసలను ప్రోత్సహిస్తూ తమ అవకాశాలను దెబ్బతీస్తున్నారని చాన్నాళ్లుగా పూర్వపు తూర్పు జర్మనీ వాసులు ఆగ్రహంతో ఉన్నారు. ఏఎఫ్‌డీ ఆ అసంతృప్తిని తనకు అనుకూలంగా మల్చుకున్నదని ఫలితాలు చెబుతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధానంతరం చకచకా కోలుకుని సుస్థిర ఆర్థిక వ్యవస్థతో యూరప్ ఖండా నికే చుక్కానిగా నిలిచిన జర్మనీని గత కొన్నేళ్లుగా సమస్యలు చుట్టుముట్టాయి. ఇవి చాల్లేదన్నట్టు ట్రంప్ చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ప్రభుత్వం మైనారిటీలో పడటంతో గడువుకు ముందే ఎన్నికలకు పోవాలని చాన్స్‌లర్ ఓలోఫ్ షోల్జ్ గత ఏడాది నిర్ణయించారు. ట్రంప్‌నూ, రష్యా అధ్యక్షుడు పుతిన్‌నూ ఎదిరించే సామర్థ్యం షోల్జ్‌కు లేదని 65 శాతంమంది వోటర్లు అభిప్రాయ పడ్డారు. తన మాట వినని దేశాలపై భారీగా సుం కాలు విధించటం, నాటో కూటమికి చరమగీతం పాడటం తప్పదని బెదిరిస్తున్న ట్రంప్ వ్యవహారశైలితో వోటర్లు అసహనంతో ఉన్నారు. దానికి తోడు మ్యూనిక్ భద్రతా సదస్సుకొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తీవ్ర మితవాద పక్షాలను దూరం పెడుతున్న యూరప్ దేశాలపై విరుచుకుపడటంతో అంతవరకూ మందకొడిగా సాగుతున్న ఎన్నికల ప్రచారానికి ఒక్కసారిగా జవసత్వాలొచ్చాయి. ఒకప్పుడు తమ దేశం సర్వనాశనం కావటానికి కారణమైన తీవ్ర మితవాద పక్షాలను వెనకేసుకురావటం ఎటూ మొగ్గని వోటర్లను ప్రభావితం చేసింది. పూర్వాశ్రమంలో సీడీయూ నాయకుడే అయినా సైద్ధాంతికంగా విభేదించి పార్టీకి దూరమైన ఫ్రెడరిక్ మెర్జ్ రెండేళ్లక్రితం అదే పార్టీ సారథ్యం స్వీకరించి సీడీయూని విజయతీరాలకు చేర్చారు. ఆయన ముందున్న సవాళ్లు తక్కువేమీ కాదు. రష్యా నుంచి తమకు ఎప్పటికైనా ముప్పు తప్పదని జర్మనీ భావిస్తోంది. ట్రంప్ వైఖరి చూస్తుంటే నాటో కూటమి అంతరించటం ఖాయమన్న సంకే తాలు కనబడుతున్నాయి. కనుకనే 'సాధ్యమైనంత త్వరగా' యూరప్ రక్షణకు ఏర్పాట్లు చేసుకోవా లని షుల్జ్ పిలుపునిచ్చారు. అందుకు దండిగా నిధులు కావాల్సివుంటుంది. ప్రస్తుతం నాటోకు యూరప్ దేశాలు చెల్లిస్తున్న మొత్తం 29వేలకోట్ల డాలర్లు. కానీ భారీయెత్తున బలగాలు, ఆయుధాలు సమీకరించాలంటే అదనంగా మరో 26 వేల కోట్ల డాలర్లు ఖర్చు చేస్తే తప్ప రష్యాను యూరప్ దేశాలు సొంతంగా ఎదుర్కొనటం సాధ్యంకాదని నిపుణులు అంచనా వేశారు. యూరప్‌లో ఆర్థికంగా అగ్రస్థానంలోవున్న జర్మనీ ఇందులో అధిక మొత్తాన్ని భరించాల్సి వుంటుంది. ఇప్పుడున్న పరిస్థి తుల్లో అది సాధ్యమేనా? ఎందుకంటే ఎగుమతులపై ఆధారపడిన జర్మనీ ఆర్థిక వ్యవస్థకు ప్రపంచ బహిరంగ మార్కెట్ వ్యవస్థలు ఇన్నాళ్లూ దన్నుగా నిలిచాయి. అమెరికా వైఖరితో ఆ శకం అంత రిస్తున్న సూచనలు కనబడు తున్నాయి. కనుక మారిన పరిస్థి తుల్లో రష్యాతో తాత్కాలి కంగానైనా అవగాహనకు రావటం ఎంతో ఉత్తమం. ఇన్నాళ్లూ అమెరికా అభీష్టానికి అనుగుణంగా ఉక్రెయిన్‌లో నైనా, మరో చోటైనా యూరప్ దేశాలు పావులు కదిపి నందు వల్లే రష్యాతో శత్రుత్వం వచ్చింది. ఇకపై ఆ దేశా లు స్వతంత్రంగా వ్యవహరిస్తాయన్న అభిప్రాయం రష్యాలో కలిగించగలిగితే చాలా వరకూ సమస్యలు సమసిపోతాయి. ఈ విష యంలో యూరప్ దేశాలు వివేకంతో ఆలోచించాలి.

# భారత్-పాక్ మ్యాచ్.. విజేతగా ముఖేష్ అంబానీ!



ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో భాగంగా ఇటీవల భారత్-పాక్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ తన సత్తా చాటారు. దాంతోపాటు ఈ మ్యాచ్ ప్రారంభం కాకముందే ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరైన ముఖేష్ అంబానీ రికార్డు సృష్టించారు. అదెలా అనుకుంటున్నారా.. రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన జియోహాట్‌స్టార్ భారత్-పాక్ మ్యాచ్‌ను ప్రసారం చేసే ప్రత్యేక హక్కులను కలిగి ఉంది. దాంతో కొన్ని గంటలపాటు సుమారు 12 కోట్ల మందికిపైగా ఈ మ్యాచ్‌ను వీక్షించారు. కంపెనీకి ఇతర ప్రసార హక్కులు, యాడ్ రెవెన్యూ ద్వారా భారీగానే ఆదాయం సమకూరినట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. దాంతో భారత్-పాక్ మ్యాచ్‌లో భారత్ విజయం సాధించడంతోపాటు దీన్ని అందరూ వీక్షించేందుకు ప్రసార హక్కులు సాధించిన ముఖేశ్ అంబానీ కూడా విజేతగానే నిలిచినట్లు భావిస్తున్నారు. రిలయన్స్ ఇటీవలే అధికారికంగా హాట్‌స్టార్‌తో కలిసి జియోహాట్‌స్టార్‌ను ఆవిష్కరించింది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ఇరు కంపెనీలకు ఎంతో లాభదాయకమని రెండు సంస్థలు గతంలో తెలిపాయి. ఇటీవల జరిగిన ఒక్కమ్యాచ్‌లోనే భారీగా రెవెన్యూ సంపాదించినట్లు మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. భారత్-పాకిస్థాన్ మ్యాచ్ రసవత్తరంగా ఉంటుందని ముందే గ్రహించిన కోట్లాదిమంది వ్యూయర్స్ జియోహాట్‌స్టార్‌లో ఈ మ్యాచ్‌ను లైవ్‌లో వీక్షించారు. ఇది ప్లాట్‌ఫామ్ వ్యూయర్‌షిప్‌ను పెంచడమే కాకుండా ప్రకటనలు, సబ్‌స్క్రిప్షన్లను, సంస్థ ఆదాయాన్ని కూడా పెంచింది. అంతేకాకుండా, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలోని మరో ఛానెల్ స్పోర్ట్స్ 18 ఈ మ్యాచ్‌ను టెలివిజన్‌లో ప్రసారం చేసే హక్కులను కలిగి ఉంది. దీంతో అంబానీ కంపెనీ ఆన్‌లైన్, టీవీ వ్యూయర్‌షిప్ రెండింటి నుంచి లాభపడింది. ఇటీవల భారత్-పాక్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ తన సత్తా చాటారు. 242 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాలో కోహ్లీ సెంచరీ (111 బంతుల్లో 100) చేశారు. మరో 7.3 ఓవర్లు మిగిలి ఉండగానే ఆరు వికెట్ల తేడాతో భారత్ మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయం సెమీఫైనల్లో భారత్ స్థానాన్ని సుస్థిరం చేయడమే కాకుండా 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత వన్డేల్లో పాకిస్థాన్‌పై రికార్డు నెలకొల్పింది.



## రైలు టికెట్ ఇలా కొంటే క్యాష్‌బ్యాక్..

సాధారణ టికెట్ల కోసం ప్రవేశపెట్టిన అన్ రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్ మొబైల్ యాప్ ద్వారా టికెట్లు కొనుగోలు చేసే ప్రయాణికులకు 3 శాతం క్యాష్‌బ్యాక్ రాయితీ ఇవ్వనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ తెలిపారు. 2016లో హైదరాబాద్ నగరంలోని ఎంఎంటీఎస్ ప్రయాణికుల కోసం మొదటిసారి యూటీఎస్‌ను ప్రవేశపెట్టారు. ఆ తరువాత 2018 జూలై నుంచి అన్ని రైళ్లలో సాధారణ టికెట్ కొనుగోళ్లకు దీన్ని విస్తరించారు. ప్లాట్‌ఫామ్ టికెట్‌లు, సీజన్ టికెట్లు కూడా యూటీఎస్ ఆర్%-%వాలెట్ నుంచి కొనుగోలు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ప్రయాణికులు ఆర్%-%వాలెట్‌తోపాటు, పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే, యూపీఐ యాప్‌లు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా డిజిటల్ చెల్లింపులు చేయవచ్చు. ఆర్%-%వాలెట్‌లో రూ.20 వేల వరకు డిపాజిట్ చేసే సదుపాయం ఉంది. యూటీఎస్ యాప్ ద్వారా టికెట్ కొనుగోళ్లను ప్రోత్సహించడానికే ఈ క్యాష్‌బ్యాక్ సదుపాయాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం సగటున ప్రతిరోజు సుమారు 83,510 మంది యూటీఎస్‌ను వినియోగించుకోగా, ఈ ఏడాది ఆ సంఖ్య రోజుకు 93,487కు పెరిగింది. ఏడాది కాలంలో 12 శాతం పెరిగినట్లు సీపీఆర్వో తెలిపారు. టికెట్ కౌంటర్‌ల వద్ద పడిగాపులు కాయవలసిన అవసరం లేకుండా అప్పటికప్పుడు యాప్ ద్వారా కొనుగోలు చేసుకొని బయలుదేరవచ్చు. దీని వల్ల ప్రయాణికులకు సమయం ఆదా కావడమే కాకుండా క్యాష్ బ్యాక్ ప్రయోజనాన్ని కూడా పొందే ఆస్కారం ఉంటుంది.

# రూ.40 లక్షల జాబ్.. రెజ్యూమ్ కూడా అవసరం లేదు!




ఈరోజుల్లో జాబ్ తెచ్చుకోవడం ఎంత కష్టమో చూస్తూనే ఉన్నాం. మంచి అకడమిక్ బ్యాక్ గ్రౌండ్ ఉండాలి. అంటే మంచి పేరున్న కాలేజీలో చదివుండాలి. ఎన్ని నైపుణ్యాలు ఉన్నా వాటిని రెజ్యూమ్‌లో ఆకట్టుకునేలా పేర్కొనకపోతే ఉద్యోగం కష్టమే. అయితే ఇవేవీ లేకుండా హై పేయింగ్ జాబ్ ఇస్తానంటున్నారు బెంగళూరుకు చెందిన ఓ కంపెనీ ఫౌండర్. బెంగళూరులో జాబ్.. ఏడాదికి రూ. 40 లక్షల వేతనం.. వారానికి ఐదు రోజులు ఆఫీసు నుంచి పని.. మంచి కాలేజీ నుంచి రావాల్సిన అవసరం లేదు.. అనుభవం అక్కర్లేదు.. కనీసం రెజ్యూమ్‌తో కూడా పని లేదు. ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం కూడా లేదంటూ కంపెనీ ఫౌండర్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్ ఆసక్తిని రేకెత్తించింది. బెంగళూరులోని ఇందిరానగర్‌లో తమ కార్యాలయానికి సున్నా నుంచి రెండేళ్ల వరకూ అనుభవం ఉన్న సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌ను నియమించుకోవాలని చూస్తున్నట్లు 'స్మాలెస్ట్ ఏఐ' కంపెనీ అధినేత సుదర్శన్ కామత్ తెలిపారు. "'స్మాలెస్ట్ ఏఐ' కంపెనీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో క్రాక్డ్ ఫుల్ స్టాక్ ఇంజనీర్ ను నియమించాలని చూస్తున్నాం. మిమ్మల్ని పరిచయం చేసుకుంటూ ఒక చిన్న 100 పదాల టెక్ట్స్ పంపండి చాలు" అంటూ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "మీది ఏ కాలేజీ అనేది ముఖ్యం కాదు".. "రెజ్యూమ్ అవసరం లేదు" అంటూ పేర్కొన్నారు. ఇక్కడ "క్రాక్డ్ ఇంజనీర్స్" అనేది నూతన మార్పులకు, కొత్త ఆలోచనలకు భయపడని అత్యంత సమర్థనీయులైన, ప్రతిభావంతులైన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లని వర్ణించడానికి ఉపయోగించే పదం. ఈ పోస్ట్ షేర్ చేసిన కొన్ని గంటల్లోనే వైరల్ గా మారింది. ఆకట్టుకునే రెజ్యూమె కంటే నైపుణ్యాలకు కామత్ ప్రాధాన్యత ఇచ్చారని పలువురు ఎక్స్ యూజర్లు ప్రశంసించారు. అయితే క్రాక్డ్ ఇంజనీర్ కు ఈ జీతం చాలా తక్కువ అని మరికొందరు వ్యాఖ్యానించారు.



## యాపిల్ డీఈఐ కార్యక్రమాలు రద్దు చేసుకోవాలని ప్రతిపాదనలు


అమెరికాలోని నేషనల్ సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ రీసెర్చ్ (ఎన్సీపీపీఆర్) యాపిల్ తన డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్(డీఈఐ) కార్యక్రమాలను రద్దు చేసుకోవాలని కోరుతూ ఇటీవల ఒక ప్రతిపాదనను రూపొందించింది. దీనికి స్పందించిన యాపిల్ వాటాదారులు ఎన్సీపీపీఆర్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా ఓటు వేశారు. డీఈఐ కార్యక్రమాలకు కట్టుబడి ఉంటానని యాపిల్ స్పష్టం చేసింది. అమెరికాలోని ప్రజా విధాన సమస్యలకు స్వేచ్ఛా మార్కెట్ పరిష్కారాలను ప్రోత్సహించడంపై ఎన్సీపీపీఆర్ దృష్టి సారిస్తుంది. అయితే యాపిల్ అనుసరిస్తున్న డైవర్సిటీ, ఈక్విటీ, ఇన్‌క్లూజన్(డీఈఐ) కార్యక్రమాలకు వ్యతిరేకంగా ఎన్సీపీపీఆర్ ప్రతిపాదనలు సిద్ధం చేయడం చర్చనీయాంశమైంది.

# అంతా.. ఇమ్రానే చేశాడు



న్యూఢిల్లీ: ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో సెమీస్‌కు చేరకుండానే పాక్ జట్టు ఇంటిబాట పట్టటంపై పాక్ టీమ్ మీద విమర్శల వర్షం కురుస్తోంది. తాజాగా పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాజీ ఛైర్మన్ నజామ్ సేథి మాట్లాడుతూ.. పాక్ జట్టు మాజీ కెప్టెన్ ఇమ్రాన్ ఖాన్ ఈ దుస్థితికి కారకుడని ఆరోపించారు. తమ జట్టు 2019 వరకు నంబర్ వన్‌గా ఉండేదని, నాటి ప్రధాని ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలు, కోచ్, ఆటగాళ్ల, సెలెక్టర్ల ఎంపికలో జరిగిన రాజకీయాలతో..జట్టులో విభేదాలు రావటంతో నానాటికీ పాక్ జట్టు ప్రమాణాలు పడిపోతూ వచ్చాయని ఆయన వివరించారు. కాగా, బుధవారం దీనిపై ఇమ్రాన్ ఖాన్ స్పందిస్తూ.. పాక్ జట్టు ఓటమి తనను నిరాశపరచిందని తనను కలిసేందుకు వచ్చిన సోదరి అలీమాతో వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది.

# ఫైనల్ ఆడేది ఆ రెండు జట్లే..!



న్యూఢిల్లీ: ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా జరిగే ఫైనల్ మ్యాచ్.. భారత, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే అవకాశముందని మాజీ ఆల్‌రౌండర్ డేనియల్ క్రిస్టియన్ ప్రకటించారు. గ్రూప్ ఏ లోని భారత్ ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడి, రెండింటా గెలిచి సెమీస్‌లో స్థానం ఖాయం చేసుకోగా, అటు ఆసీస్ జట్టులోని యువ ఆటగాళ్లు జోస్ ఇంగ్లీష్, అలెక్స్ కేరీ, మ్యాక్స్‌వెల్ ఎలాంటి ఒత్తిడినైనా అధిగమించి ఆడతున్నారని డేనియల్ చెప్పుకొచ్చారు. అయితే, వర్షం కారణంగా రావల్పిండి మ్యాచ్ రద్దు కావటంతో గ్రూప్ బీలోని ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లకు చెరొక పాయింట్ దక్కాయని, దీంతో రేసు రసవత్తరంగా మారనుందని డేనియల్ చెప్పుకొచ్చారు.

## ఈ వయసులోనూ
# సచిన్ మెరుపులు



న్యూఢిల్లీ: క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 52 ఏళ్ల వయసులోనూ తగ్గేదేలే అంటూ దూసుకెళ్తున్నాడు. రిటైరైన ఆటగాళ్లతో బుధవారం నిర్వహించిన ఐఎంఎల్ టోర్నీలో భాగంగా ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇండియా మాస్టర్స్ తరఫున బరిలోకి దిగిన సచిన్ ధనాధన్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. 21 బంతుల్లో 5 బౌండరీలు, 1 భారీ సిక్స్‌తో 34 పరుగులు చేశాడు. ఆటకు రిటైర్మెంట్ ప్రకటించి 12 ఏళ్లైనా, తన ఆటతీరులో ఏ మాత్రం తగ్గలేదని నిరూపించాడు. ముఖ్యంగా కుర్రాళ్ల మాదిరిగా మెరుపు వేగంతో షాట్స్ కొడుతూ 'వావ్'అనిపించుకున్నాడు. సచిన్‌తో బాటు ఆఖరిలో వచ్చిన యువరాజ్ సింగ్ కేవలం 14 బంతుల్లోనే 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 27 పరుగులు చేసి అజేయంగా నిలవటంతో ఇండియా జట్టు 9 వికెట్ల తేడాతో గెలుపొందింది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్5లో కోహ్లీ



న్యూఢిల్లీ: ఐసీసీ ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్ లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మరోసారి దూసుకెళ్లాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌పై అజేయ శతకం చేసిన కోహ్లీ, గతంలో ఉన్న ఆరవ స్థానం నుంచి ఐదవ ర్యాంకును సాధించారు. మరోవైపు.. టీమిండియా వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. ఇటీవలే పాక్ ఆటగాడు బాబర్ ఆజామ్‌ను వెనక్కినెట్టి తొలిస్థానంలో నిలవగా, తాజా ర్యాంకింగ్స్‌లోనూ అదే స్థానాన్ని నిలుపుకోగలిగాడు. అలాగే, కెప్టెన్ రోహిత్ శర్మ కూడా గతంలో ఉన్న మూడో ర్యాంకును నిలబెట్టుకోగా, శ్రేయస్ అయ్యర్ 679 పాయింట్లతో తన 9వ స్థానంలోనే ఉన్నాడు. మొత్తంగా చూస్తే, తాజా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ -10లో నలుగురు టీమిండియా బ్యాటర్లే ఉండటం విశేషం.

---

# ప్రభాస్-ప్రశాంత్ కాంబో ఫిక్స్



హైదరాబాద్: 'హనుమాన్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు ప్రశాంత్ వర్మ ప్రస్తుతం 'జై హనుమాన్'సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. కాగా, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా ప్రశాంత్ వర్మ ఒక సినిమా చేయనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ మూవీ స్క్రిప్ట్ సనులు జరుగుతున్నాయని, ఈ ప్రాజెక్ట్ కోసం త్వరలోనే ప్రభాస్ లుక్ టెస్ట్‌లో పాల్గొనబోతున్నారని సమాచారం. కన్నడ టాప్ బ్యానర్ హోంబలే ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుండగా, పౌరాణిక కథాంశంతో ఈ మూవీ తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ దర్శకుడు గతంలో రణబీర్ సింగ్‌తో తీయాలని అనుకున్న 'బ్రహ్మ రాక్షస్' అనే ప్రాజెక్ట్‌నే ప్రస్తుతం ప్రభాస్‌తో తీయబోతున్నారనే టాక్ వినిపిస్తోంది.

# తెలుగులోనూ 'ఛావా'రిలీజ్



హైదరాబాద్: మరాఠా యోధుడు శంభాజీ జీవిత కథ ఆధారంగా బాలీవుడ్‌లో తెరకెక్కిన చిత్రం.. ఛావా. విక్కీ కౌశల్ హీరోగా వచ్చిన ఈ మూవీకి లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించగా.. దినేశ్ విజన్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది. ఫిబ్రవరి 14న రిలీజైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు నమోదు చేసింది. ఇప్పటికే రూ.470 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రూ.500 కోట్ల మార్క్‌కి దూసుకెళుతోంది. అయితే, ఈ చిత్రం తెలుగులోనూ రాబోతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ దీనిని మార్చి 7న రిలీజ్ చేసే దిశగా అడుగులు వేస్తోంది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుంది. ఈ సినిమాలో విక్కీ కౌశల్ పాత్రకి తెలుగు అగ్ర హీరోతో డబ్బింగ్ చెప్పిస్తున్నట్లు సమాచారం.

# విశ్వక్ జోడీగా.. డ్రాగన్ హీరోయిన్





హైదరాబాద్: ఇటీవల సూపర్ హిట్ మూవీగా నిలిచిన'డ్రాగన్' మూవీలో హీరోయిన్‌గా నటించిన కయాదు లోహర్ మరో లక్కీ చాన్స్ కొట్టేసింది. టాలీవుడ్ హీరో.. విశ్వక్ సేన్ కొత్త మూవీ 'ఫంకీ'కోసం ఆమెను సంప్రదించగా, ఈ అమ్మడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. రొమాంటిక్ కామెడీగా వస్తున్న ఈ మూవీని అనుదీప్ కేవీ తెరకెక్కిస్తుండగా, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు భీమ్స్ సిసిరోలియా సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే పూజా కార్యక్రమం పూర్తైన ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది.

# సీక్వెల్‌తో వస్తున్న రవితేజ



హైదరాబాద్: హిట్, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తున్న టాలీవుడ్ సీనియర్ నటుడు.. రవితేజ. కాగా, 2022లో రవితేజ నటించిన 'ధమాకా'మూవీకి సీక్వెల్ రానుందని ఈ మూవీ డైరెక్టర్ నక్కిన త్రినాథరావు తెలిపారు. అప్పట్లో రూ. 100 కోట్లకు పైగా వసూలు చేసి రికార్డుగా నిలిచిన ఈ మూవీ స్క్రిప్ట్ వర్క్ రెడీ అయిందని, దీనికి 'డబుల్ ధమాకా'అనే టైటిల్ దాదాపు ఫిక్స్ అయిందని చెప్పుకొచ్చారు. త్రినాథరావు దర్శకత్వంలోనే తెరకెక్కనున్న ఈ మూవీని దిల్ రాజు నిర్మించనున్నారు. అయితే, కిక్ మూవీ హిట్ అయిన తర్వాత దానికి సీక్వెల్‌గా వచ్చిన కిక్ 2 సక్సెస్ కాకపోవటంతో ఈసారి.. సీక్వెల్‌తో రవితేజ హిట్ కొడతాడని ఆయన ఫ్యాన్స్ గట్టి నమ్మకంతో ఉన్నారు. ప్రస్తుతం భాను బోగవరపు దర్శకత్వంలో రవి తేజ, శ్రీలీల జంటగా నటిస్తోన్న మాస్ జాతర' మూవీ మే 9న రిలీజ్ కానుంది.